PRAMUKHANDHRA 27th Year of Publication We carry the news and views of Telugus

THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

27 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీ రామారావు

₹.15
జనవరి 2021





# ప్రముఖాంధ్ర 26 ఏళ్ళు పూర్తిచేసుకుంది

2021 జనవరి సంచిక 27వ సంవత్సరపు మొదటి సంచిక.

సరిగ్గా నేను బాధ్యత తీసుకుని 26 నెలలయ్యింది. వ్యాపాలన్ని చూసి నన్ను నాన్నతో పోల్చుకుంటూ కామెంట్లు వస్తాయని తెలుసు, వచ్చాయి కుడా. నేను ముందే చెప్పినట్టుగా తలకిందుల తపస్సు చేసినా ఆయనలా రాయలేను, కాని పరవాలేదులే అనిపించే సామర్థ్యం వుంది. ఆయన్నే తలుచుకుంటూ రాస్తున్న ప్రయత్నం మంచిది కాబట్టి విజయం సాధిస్తాననే అనుకుంటున్నా. ఆయన స్నేహితుల ప్రోత్సాహం శ్రీరామరక్ష. ఈ సంచికలో కాస్త వైవిధ్యానికి ప్రయత్నించా, సఫలీకృతమయ్యిందనే భావిస్తున్నా.

ఆయన వాడిన పెన్ను, ప్యాడ్, కుర్చీ ,ఆయన రోజూ వాడే వెండి కుంకుమ డబ్బా వాటితో పాటు ఎదురుగ్గా ఆయన ఫోటో, ఇవన్నీ నా సెంటిమెంటూ. వీటికి తోడు కులదైవం ఏడుకొండలవాని సదా హృదయంలో నింపుకుంటూ, గురువు సాయినాథుని కృప ,మా దేవత అమ్మ ఆశీస్సు.అసంఖ్యాక తెలుగు అభిమానుల ప్రేమామృతం.

ఇన్నిటిని పట్టుకుని ముందుకెళ్ళిపోవడమే.

జయహో

-మీ

**గోటేటి వెంకటేశ్వరరావు**
pramukhandhra95@gmail.com



# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జనవరి 2021

సంపుటి : 27 313 సంచిక : 1




## భారతదేశమే 'ప్రపంచ విశ్వభారతి' కావాలన్న రవీంద్ర కవీంద్రుని కలలు కల్ల గాకూడదు!!

### -సహాయ నిరాకరణము, సమ్మెలూ, బంద్‌లూ అసమర్థులు, విద్రోహుల చేతుల్లోబడి సంపద విధ్వంసం గాకూడదు!

విశ్వకవి రవీంద్రుదు మాతృభాషాభివృద్ధికే గాకుండా, దేశీయమైన కళలు, వృత్తులు, సంస్కృతి సాంప్రదాయములనూ, శాంతియుత జీవితమునూ ప్రజల్లో గుర్తింపు తెచ్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసారు.

తల్లిపాలు త్రాగిన బిడ్డ ఎవ్విధంగా ఆరోగ్యంగా పెరుగుతాడో, మాతృభాషా అభ్యాసనం చేసిన విద్యార్థి కూడా ఎంతో ఆరోగ్యంగానూ, మానసికంగా, శారీరక పరంగా, విజ్ఞానపరంగా, వివేచన, విమల మనఃస్థితుడుగా బలిష్ఠుడు అవుతాడని బెంగాలీ రాష్ట్రంలో బెంగాలీ భాషనే బోధనా భాషగా చేయడానికి కారకుడయ్యారు.

గురుకులాశ్రమంలా, ఏడెకరాల విస్తీర్ణంగల ఆ ఆశ్రమానికి 'బ్రహ్మచర్యాశ్రమం' అని పేరుపెట్టి, కేంద్రభాగంలో 'శాంతినికేతనం', ఉత్తరాన ఆలయం, నైఋతి భాగంలో మూడు గదుల భవనం శాస్త్ర పద్ధతిలోనే నిర్మించారు. నైఋతిలో ఉన్న మూడుగదుల భవనంలో తన వద్ద ఉన్న పుస్తకాలనూ, వైజ్ఞానిక శాస్త్ర పరికరాలనూ ఉంచారు. విజ్ఞానకరమగు విద్యను జీవితంలో అంతర్భాగం చేయాలన్నదే రవీంద్రుని లక్ష్యం. ఆశ్రమవాసులైన పిల్లలకూ ప్రకృతిలో ఆత్మీయ సంబంధం ఏర్పరచాలన్నది ఆయన ముఖ్యోద్దేశం. విద్యార్థులకీ- ఉపాధ్యాయులకీమధ్య విజ్ఞానార్జన సంబంధమే గాకుండా ఆత్మీయమైన సన్నిహితత్వం ఉండాలనీ, తోటిమానవులతో, ప్రకృతీ పరిసరాలతో సన్నిహితత్వం కలిగి, ఋతువులరీత్యా వచ్చే పర్వదినాలను తోటివారితో సఖ్యంగా జరుపుకుంటూ, అతిథుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ, అతిథి మర్యాదలను పాటించాలని సూచిస్తూ, సకాలంలో పనులు నిర్వర్తించడం, చేసే పనుల్లో స్వేచ్ఛనివ్వడం, మానవులంతా ఒకే కుటుంబమనే విశ్వభావనను చిరు ప్రాయంనుంచే వారిలో చిగురింపచేయడం రవీంద్ర కవీంద్రుని ఆశయంగా పాటించ బడింది. విశ్వంలోనే ఏకైక విశ్వభారతిగా గణుతింపబడింది. ఇందుకై 'పేరీ' లో సముద్రతీరాన తమ ఇంటిని విక్రయించారు.

పిల్లలను పసివారిగా భావించి, మూసపోసిన అదే ధోరణిలో బోధిస్తే మానస వికాశం, బుద్ధి పరిణత, క్రమశిక్షణ కలుగదని, వారిలోగల అనంతశక్తి వక్రీ కరణగాకుండా ముందే నీతివిజ్ఞత, కలిసికట్టుభావం నేర్పాలన్నది రవీంద్రమహాశయుని ఆశయం. నిజానికి 'శాంతినికేతన్' వంటి విద్యాశ్రమం నెలకొల్పడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతని గుర్తించాలి. (ఈ విషయంలో భగవాన్ సత్యసాయి కృషి చేసారు.) రవీంద్రులు తన కాలంలోనే విశ్వభారతిలో విద్యాభవనం, కళాభవనం, సంగీత భవనం, శిక్షణాభవనం, శ్రీనికేతనం, శిల్పభవనం, హిందీభవనం నెలకొల్పారు. 1921 డిసెంబరులో విశ్వకవి ఆ భవనములను, నోబెల్ బహుమతి ద్వారా వచ్చిన ఆదాయమును, తన సర్వఆస్తులను తాను సేకరించిన గ్రంధాలను దేశపౌరులకే అప్పగించారు.

ఆయనలో స్వాభిమానం, దేశాభిమానం ఎక్కువ. జలియన్‌వాలాబాగ్‌లో బ్రిటీష్‌వారు భారతీయులపై జరిపిన దారుణ హింసాకాండను నిరసిస్తూ, తనకు బ్రిటిష్ ప్రభుత్వం యిచ్చిన గౌరవబిరుదును తిరిగియిచ్చేసారు.

రవీంద్రులంటే మహాత్మాగాంధీకి ఎంతో గౌరవం. రవీంద్రుని 'గురూజీ' అని పిలిచారు. 1921 సం॥ములో శాంతియుతంగా సహాయనిరాకరణోద్యమం తలపెట్టాలంటే రవీంద్రులు ఒప్పుకోలేదు. అది అసమర్థులచేతుల్లో పడి హింసాత్మకమవుతుందనేది రవీంద్రుల భావన. చివరకు అలాగే జరిగింది. బీహార్‌లో అది హింసకు దారితీసి చేరాచౌరీ పోలీసుస్టేషన్‌ను ఆవేశపరులైన ఉద్యమకర్తలు తగులపెట్టారు. దానితో గాంధీజీ ఆ ఉద్యమాన్ని విరమింపజేసి, రవీంద్రుని వద్దకు వెళ్ళి, నీవు దేశసంరక్షకుడవు, శాంతి ప్రియునిగా అభినందించారు. చరఖా కార్యక్రమాన్ని కూడా రవీంద్రుడంగీకరించలేదు. ఇరువురి మధ్య పరస్పర వైరుధ్య భావాలున్నా, ఒకరిపై నొకరికి గౌరవం ఉండేది. 1932 సం॥ములో 'గాంధీజీ'ని విచారించకుండా జైలపాలు చేసినపుడు, రవీంద్ర కవీంద్రుడు తన జన్మదినోత్సవాలను రద్దుచేసుకున్నారు. ఇది దేశప్రియుల లక్షణం. ఇప్పటి దేశనాయకులనే అందరిలోనూ ఈ లక్షణం లోపించింది. విద్యార్థులను కూడా రాజకీయరంగలోకి దింపి, వారి భావిజీవితాన్ని బుగ్గి చేస్తున్నారు.

ఒక్కరైనా రవీంద్రుని వంటి వారు, వివేకానందుల వంటి దేశభక్తిగల మహత్పురుషులు అవతరించగలరని ఆశిస్తున్నాను. దూషణ భూషణలు చేసే వారినీ ఉద్యమకారుల్నీ బహిష్కరిస్తేనే దేశానికి భవిష్యత్తు.



*బుధజన విధేయుడు*

*- గోటేటి శ్రీరామారావు*

(జనవరి 2012, ప్రముఖాంధ్ర)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



## నిను చూడగానే ఉషస్సు నాలో కలిగెను తేజస్సు!

# అభయప్రదాత శ్రీ వెంకటేశా! శ్రీ శ్రీనివాసా!

## పద్మావతీ వల్లభా! ప్రముఖాంధ్ర రక్షకుడవీవే!

*ఒక్కసారి నావైపు చూడు!*
*నిన్ను నా కంటిపాపలా చూసుకోకుంటే అడుగు!*
*ఒక్కసారి నన్ను నీ తోడు చేసుకుని చూడు!*
*నీ వెంట నీడనై రాకుంటే నన్నడుగు!*
*ఒక్కసారి నా సాన్నిధ్యానికి వచ్చి చూడు!*
*నా సర్వశక్తులు నీకు ధారపోయకుంటే అడుగు!!*
*ఒక్కసారి నా శ్రీ మతాన్ని పాటించి చూడు!*
*నిన్ను శ్రేష్ఠాతి శ్రేష్ఠముగా మలచకుంటే అడుగు!!*
*ఒక్కసారి నీ సమస్యలను నాతో చెప్పుకుని చూడు!*
*నీ సమస్యకు నేను సమాధానం కాకుండే అడుగు!!*
*ఒక్కసారి నా అడుగులో అడుగేసి చూడు!*
*అడుగడుగునా నీకు అండగా నేనుండకుంటే అడుగు!!*
*ఒక్కసారి నా సేవలో చిటికిన వేలందించి చూడు!*
*నీ అవసరానికి చిటికెలో నీ ముందుండ కుంటే అడుగు!!*
*ఒక్కసారి నాపట్ల విశ్వాసపాత్రుడవై ఉండి చూడు!*
*నీ వెన్నంటి విజయం రాకుంటే నన్నడుగు!!*
*ఒక్కసారి నీలోని వ్యర్థానికి బిందువు పెట్టి చూడు!*
*నీ జీవితం వజ్రతుల్యం చేయకుంటే అడుగు!!*
*ఒక్కసారి మనఃపూర్వకంగా నన్ను తలచుకుని చూడు!*
*నీ మనోకామనలు తీర్చకుంటే అడుగు!!*

### గోవిందుడు అందరివాడు!

**సర్వ పాపిని వేం ప్రాహుః కటః తద్దాహ ఉచ్యతే! –**

అన్నారు. తిరుమల శ్రీనివాసుని సందర్శనం మాత్రముననే సకల పాపములూ భస్మీపటలం కావడమే గాకుండా, సకలాభీష్టములూ నెరవేరుతాయట. అందుకే పెద్దలు 'శ్రీ వేంకటేశ నమోదేవోనాస్తి నాస్తి మహీతలే!' అని కూడా ఆ పెద్దలే ప్రవచించిన మాట అక్షఱ సత్యం.

క్రొత్త సంవత్సరం ఉదయిస్తూందంటే క్రొత్త ఆశలు కూడా చిగురిస్తాయ్.

కలియుగం దైవం వేంకటేశ్వరుడొక్కడే కదా! ఆయన్ను 'కలౌ వేంకట నాయకా' అన్నారు. పూట పూటకూ ఆయన మూలవిరాట్‌కూ జరిగే అలంకరణల్లోని సొగసులనూ, తొడిగే ఆభరణాలనూ చూడడానికి రెండు కన్నులే కాదు, రెండు వేల కన్నులున్నప్పటికినీ చాలవు.

ఇలాటి కలియుగ వైకుంఠ వాసుడైన వేంకటేశ్వరునికి స్థానమిచ్చినది వరాహస్వామి. ఆయన్ను దర్శించి స్తుతించి తీరాలి.

నీ కోర కొన యందు అంటి వున్న భూగోళం చంద్రునిలోని ఓ మచ్చలా వుంది. వరాహావతారం ధరించిన ఓ స్వామీ, జయ జగదీశా, హరీ! నన్ను కాపాడు – అంటూ ప్రార్థించాలి.

కలియుగ ఆరంభంలో భూమిని అపహరించి సముద్ర గర్భంలో దాగివున్న రాక్షసరాజు హిరణ్యాక్షుని భూదేవి కోరికపై, హరి మహా సూకరాకారుడై తన శరీరాన్ని విపరీతంగా పెంచి, తన ముట్టెతో ప్రళయ జలధి నుండి పెకలించి, అందులోని నీళ్లు, బ్రహ్మాండమనే చిప్పను చీల్చుకుని వెళ్లేంత వేగంగా పైకి చిమ్మి క్రిందకు పడుతున్న ఆ నీటి ధారలతో బ్రహ్మాండాన్ని పైకెత్తిన శక్తిని ముత్యాల గుత్తి తోడివలె బంగారు ముక్కరగా అలంకరించాడా స్వామి. వీటిలో ప్రకృతీ సంపదయైన వనములు, నదులు, పర్వతములన్నీ పైకి వచ్చాయ్. అలా వచ్చినదే తిరుమల కొండ. ఆ కొండపైననే ఆది వరాహమూర్తి భూదేవీ సహితుడై ఉండిపోయాడు. ఆయన ఆలయాన్ని అనుకునే ఓ పుష్కరిణి వెలసింది. ఆప్రక్కనే ఆనంద నిలయం.

**ఎందరి వాడోనమ్మ గోవిందుడు**
**ఎందరి డెందాలను పరవశింప చేస్తున్నాడో!**
**మహేశ్వరుణ్ణి కొలిచేవారూ!**
**మహావిష్ణువుని కొలిచేవారూ!**
**అయ్యప్పను కొలిచేవారు – అమ్మ**
**దుర్గమ్మను కొలిచేవారూ –**
**బుద్ధుణ్ణి కొలిచేవారూ సుబ్ర**
**హ్మణ్యుని కొలిచేవారూ!–**
**కృష్ణుణ్ణి కొలిచేవారూ! క్రీస్తును**
**కొలిచేవారూ! రాముణ్ణి కొలిచేవారూ**
**రహీమ్‌ను కొలిచేవారూ – ఎందరో**
**ఎందరెందరో ఈ సుందరాంగుని**
**చూడవస్తారమ్మా! వడ్డీ కాసులు తెస్తారమ్మా**
**ఏ వూరు, ఏ రాష్ట్రం, ఏ దేశంలోనూ వెలయని**
**వెలకట్టలేని వాడు వేంకటేశుడమ్మా**
**ఎంత చక్కనివాడో! ఎన్ని వరాలిచ్చేవాడో**
**శ్రీ వేంకటేశుడూ, సిరిగల వెంకటేశుడు**
**సిరులిచ్చేవాడు సిరులు వసూలు చేసేవాడు**
**శ్రీ వేంకటేశుడమ్మా! తిరుమల వేంకటేశుడమ్మా!** ●

# సంక్రాంతి లక్ష్మికి ముగ్గుల్లోయమ్మ ముగ్గుల్లు అంతరంగ వల్లికల ముగ్గుల్లు!



**ముగ్గులు పెట్టరేయమ్మ– ముగ్గుళ్లు పెట్టరే**
**ఇల్లలికి, వాకిలికి ముగ్గు పెడితేకదా అందం**
**సంక్రాంతి లక్ష్మికి శోభాయమానం!**

–అని కన్నెపిల్లల నోటినుంచి వచ్చేమాట సంక్రాంతి ముందు ధనుర్మాసం నుంచే– ఇల్లు అలికి ముగ్గుపెట్టరే– ఇంతులార పూబంతులార– అనేవారుగానీ– ఇప్పుడు మట్టిగోడలూ, మట్టి నేలలూ గల ఇల్లులు లేనేలేవు. అందుకే వాకిటినైన గోమయపు నీళ్లు చల్లి ముగ్గు పెట్టరారమ్మో– అదియును సంక్రాంతి ముందొక నెలయేకదమ్మా అని విన్నవించ వలసివస్తుంది. అసలు నిత్యమూ వాకిట ముంగిట ముగ్గులు పెడుతూంటే– శ్రీ మహాలక్ష్మి ఛెంగుఛెంగుమని అడుగులు వేసుకుంటూ ఇంటికి 'సిరి' ముటగట్టుకుంటూ వస్తుంది. ఆనాడు పల్లె పల్లెలోనూ ముగ్గుల్ని జూచి వరి మహాలక్ష్మి– ధాన్యలక్ష్మి రాశులు రాశులుగ బస్తాలు ఇంటికి చేరేవి. అంతా తాము ఒక్కరమే తినడమెందుకుని– పక్ష్యాదుల కోసం ఇంటి చూరుకు వరికంకెలు కట్టేవారు. ఆంగ్ల సంవత్సరంలో వచ్చే ఈ తొలి పండుగ ఇంటికి వరిసిరి రావడం, వచ్చినవన్నీ మనమే తినకుండా, దానగుణమలవరచడం – మనసు శరీరాల్లో అట్టడుగుకు పోయిన ఆనందాన్ని వెలికితేవడానికీ భోగి, పెదపండుగ, కనుమ పండుగలు మనమును కమనీయముగా రమారమణీయానందాను భూతులొసగే పండుగలుగా పరవశింపచేస్తాయి.

**నిత్యదానము చేత – నియమంబు కలుగు**
**నిత్యదానము చేత – కష్టాల తొలగు**
**నిత్యదానము చేత – సత్యంబు దొరకు**
**నిత్యనదానము చేత – నిఖిలంబు లభించు**
**నిత్యదానము చేత – నిరయము నశించు**
**నిత్యదానము చేత – నెలతకూజూడ**
**నిత్యమగు వైకుంఠ సామ్రాజ్యమంబు**

– చిన్న పిల్లలకు సహితమూ అర్ధమయ్యేట్టు, పిన్నతనము నుంచీ సత్యము, ధర్మము, దానగుణములల వడడానికి ఇలాంటి పద్యాలు చెప్పేవారు.

ఈ సంక్రాంతి పండుగకు నెల ముందు నుంచీ పిల్లలకూ, స్త్రీలకూ, పెద్దలకు అనేక నిత్య కార్యక్రమము లేర్పరచారు. నిజానికిది చలికాలమైనప్పటికినీ పిల్లలూ, పెద్దలూ సూర్యోదయానికి ముందే లేవాలి. కొందరు కూడికూతకు ముందే లేస్తారు. కాలకృత్యాలు తీర్చుకుని, వాకిట ముందు ముగ్గులు పెడతారు. ఆ ముగ్గుల్లో పిల్లలు ఆవుపేడతో జీడిమామిడికాయల్లాంటి గొబ్బెమ్మలు పెట్టి, పైన బంతిపువ్వు పెట్టి, గొబ్బిళ్ళ పాట పాడుతూ, గొబ్బెమ్మ చుట్టూ తిరుగుతూ, గొబ్బీయల్లో గొబ్బీయులనే పాట చప్పట్లు కొడుతూ పాడడం, ఆ గొబ్బెమ్మలను గోడలపై పిడకలు వేసి, మరునాటి ముగ్గులో పెట్టే గొబ్బెమ్మలను, ఇలాగే పాటలను పాడిన తరువాత గొబ్బెమ్మలను గోడపిడకలుగా చరిచి భోగి పండుగనాడు ఆ ఎండిన గొబ్బెమ్మలను ఓ దండగా గుచ్చి మంటల్లో వేస్తూ, భోగి మంట చుట్టూ తిరుగుతూ ఆనంద భోగం అనుభవించడం భోగి పండుగ ప్రత్యేకత.

**గొబ్బీయల్లో గొబ్బీయల్లో**
**గొబ్బితట్టు బాలికరెల్లరూ గుంపు గూడుడీ**
**గుండ్రముగా నీటుగాను గొబ్బి వేయుదాం!**
**గొబ్బీ సుబ్బమ్మా! నీవూ రావమ్మా**
**అడుగున అడుగేసి ఆటలాడమ్మా**
**నరసాపురం నుంచీ గొబ్బి నర్సమ్మ వచ్చె**
**సుబ్బి గొబ్బెమ్మా సుఖపడనిస్తావా?**
**తామరపువ్వంటి తమ్ముణ్నిస్తావా?**
**చేమంతిపూవంటి చెల్లెల్నిస్తావా?**
**మల్లెపూవంటి మరిదినిస్తావా?**
**మంకెనపువ్వంటి మరదల్నిస్తావా?**
**మొగలిపువ్వంటీ మొగుణ్ణిస్తావా?**

– ఇలా ఆటపాటలతో ధనుర్మాసం నెల్లాళ్లూ ఆనందంగా గడిచిపోతుంది. భోగినాడు పిల్లలు తలంటి స్నానం చేసి, గుత్తులు గుత్తులుగా కట్టిన గొబ్బి దండలను భోగి మంటల్లో వేసి ఆనందంతో తబ్బిబ్బవ్వడంతో ఆరోజు ప్రారంభమవుతుంది. సాయంత్రం ఇంట్లోని చిన్న పిల్లలను కూర్చోబెట్టి భోగిపళ్ళను పోస్తారు. నానవేసిన సెనగలు, రేగుపళ్ళు, చిల్లర నాణెములు భోగి పళ్ళెంలో వేస్తారు. పేరంటానికి వచ్చిన ముత్తైదువులు పాటలు పాడి భోగిపళ్ళు నెత్తిమీద పోసి ఆశీర్వదిస్తారు. రెండవ రోజు సంక్రాంతి. సంక్రాంతినే పెద్ద పండుగగా జరుపుకుంటారు. ఆరోజుననే సూర్యనారాయణమూర్తికి పొంగళ్ళు పెడతారు. తమిళనాడులో అయితే పొంగలో పొంగల్ అని పాటలు పాడుతూ పరవశం చెందడం ఈనాటికీ జరుగుతూన్నది.

**పాడి పంటలకు లోటులేని పల్లెసీమ మనదిరా**
**ముత్యాల ముగ్గుల్లో గొబ్బెమ్మలు పెట్టి**
**బంతి పూమాలలు ద్వారబంధానికి కట్టి**
**పొలిచ్చే పశువులకు పసుపూ కుంకుమ**
**పనిచేసే బసవడికి పత్రీ పుష్పం**
**గాదుల్లో ధాన్యం కావిళ్ళ భాగ్యం**
**కష్టించే కాపులకు కలకాలం సౌఖ్యం**



"సమ్యక్ క్రాంతి" సంక్రాంతి. అంటే పవిత్రమైన, దివ్యమైన కాంతి, హృదయానికి శాంతి ప్రదర్శించేదే సంక్రాంతి. ఈ పండుగ సమయంలో పంటలు చేతికి వచ్చి, చలి తగ్గి వాతావరణం ఆహ్లాదకరమై, మానవులందరికీ విశ్రాంతి, ఆనందం లభింపచేస్తుంది.

భారతీయుల పర్వదినాలన్నీ పవిత్రమైన అంతరార్థంతో కూడినవి. సూర్యుడు తన గమనంలో ఒక్కొక్క నెలలో ఒక్కొక్క రాశిలో ప్రవేశిస్తూ ఉంటాడు. మనకు 27 నక్షత్రాలు ముఖ్యమైనవి. ఒక్కొక్క నక్షత్రాన్నీ 4 పాదాలుగా విభజించారు. 27 × 4 = 108 పాదాలు ఈ 108 పాదాలలోనూ సూర్యుడు తిరిగి వచ్చే సమయం 12 నెలలు = ఒక సంవత్సరం. ఈ 12 నెలల్లో సూర్యుడు ఒక్కొక్క రాశిలో ఒక నెల చొప్పున, సంచరిస్తూ ఉంటాడు. అలా సంచరించే (కూడివుండే) సమయాన్నే "సంక్రమణం" అంటారు. ఆ సమయంలో సూర్యుని తేజస్సు, అనుగ్రహం, ఆయా నక్షత్రాలలో పుట్టినవారికి, ఆయా రాశులవారికి ఎక్కువగా ఉపకారి యవుతుంది.

ఆకాశంలో కనిపించిన నక్షత్రముల 27 × 4 = 108 పా॥లను తీసికొని ఒక్కోచోట గుంపుగా ఏర్పడిన ఆకారాలను బట్టి బొమ్మలను గీస్తే మేషం. మిథునం, సింహం వంటి బొమ్మలు ఏర్పడటం ఆయా నక్షత్రాల గుంపులకు రాశులని, పేర్లు పెట్టారు. ఉదా :- మేషరాశి (అశ్విని నక్షత్రం 4 పాదాలు + భరణి నక్షత్రం 4 పాదాలు + కృత్తిక నక్షత్రంలో 1వ పాదం) కలిపితే మేషం అయింది. అవే మేషరాశి నక్షత్రాలు. ఇలా మేషం, వృషభం మొదలు మీనం వరకు 12 రాసులుగా మొత్తం 27 నక్షత్రాలు విభజింపబడ్డాయి

సూర్యుడు ఆయా రాశులలో సంచరించినప్పుడు ఆయా సంక్రాంతులు వస్తాయి.

1. ధనుస్సు – మిథునం–కన్య–మీనరాసులలో సూర్యుడు సంచరించినప్పుడు ఏర్పడే కాలాన్నీ "షడశీతి" సంక్రమణం అంటారు.

తులా రాశిలో సూర్యుడు ప్రవేశించినపుడు "శరద్విష్ణు" సంక్రాంతి అంటారు.

సింహ–వృషభ–వృశ్చిక–కుంభరాసులలో "వసంతవిష్ణు" సంక్రాంతి అంటారు.

కర్కాటక–మకరరాసులలో ప్రవేశించినపుడు 'అయనం' అంటారు. మకరరాశిలో ప్రవేశిస్తే మకరసంక్రమనం. అదే ఉత్తరాయణం. కర్కాటక సంక్రమణం. అదే దక్షిణాయనం.

"సంక్రాంతిసహస్రస్తుఫలం" అని వేదవచనం. అంటే ఏవైనా మామూలు రోజులలో చేస్తే వచ్చే ఫలం కంటే సంక్రాంతి సమయంలో వెయ్యిరెట్లు అధికఫలం, చెడ్డ పనైతే వెయ్యిరెట్లు చెడ్డఫలం. ముఖ్యంగా సంక్రమణ సమయంలో చెయ్యవలసిన పనులు "స్నానం, జపం, ధ్యానం, దానం, హోమం" ఈ ఐదూ ప్రధానమైనవి.

**స్నానం : రవి సంక్రమణే, ప్రాప్తేన స్నానాద్యస్తు మానవః**
**సప్తజన్మని రోగీశ మిథునశ్చైవ జాయతే.**
**ఇతివచనాత్ మనుష్య మాతస్య స్నానం నిత్యం శ్రుతి.**

అంటే ఏడు జన్మల నుంచి రోగాలతో బాధపడుతున్నవారు కూడా రవి సంక్రమణసమయంలో నదులలో స్నానం చెయ్యడం వలన రోగవిముక్తులవుతారని వేదం చెబుతోంది. స్నానం ఆరు విధాలు 1. సూర్యకిరణ స్నానం, ఎండలో ఉండటం. 2. ఆవుపేడ శరీరమంతా రాసుకోవడం. 3. పసుపుకుంకుమలు శరీరమంతా రాసుకోవడం. 4. విభూతి శరీరమంతా రాసుకోవడం. 5. పుణ్య నదీజలాలలో మునగడం. 6. సముద్ర స్నానం.

**దానం :** అలాగే సంక్రాంతి సమయంలో దానం చేసినవారు జన్మసాఫల్యం చెందుతారు.



**బంగారు బొమ్మల కొలువు మాయింట్లో పేరంటం**
**రండమ్మా రండమ్మా రండి – కొత్త**
**అల్లుడొచ్చెను చూడగరండి – సంక్రాంతి**
**పండుగే పండుగ – సంబరాల సంక్రాంతి**
**సంబరాలే సంబరాలు సౌందర్యపు సంబరాలు**

– అంటూ పంటలే యింటికి వచ్చి, కొత్త అల్లుడు అమ్మడు కొంగట్టుకు తిరుగుతుంటే హాయమ్మ హాయి నాలుగు రోజుల హాయీ భోగి, మకర సంక్రాంతి, కనుమ, ముక్కనుమ అని నాలుగు రోజులే కాదు, నెల్లాళ్ళు పండుగే! సూర్యనారాయణమూర్తికి పొంగలి పెట్టడం, ఇంటి ముంగిట గంగిరెద్దుల వాళ్ళు, హరిలోరంగ హరి అనే హరిదాసులు, పగటి వేషగాళ్ళు పాలెగాళ్ళతో ఇల్లు పరవశమవుతుంటే – ఇంటి అరుగుల చూరుకు కట్టిన వరికంకెలకు పిచ్చుకలు వస్తాయ్. బావ మరదళ్ళతో పరిహాసాలు భలే జోరుగుంటాయ్. అందుకే కవులు పొంగి పొంగి వచ్చింది, సంబరాల సంక్రాంతి – సంపదలు పెంపు చేయు సంక్రాంతి అన్నారు. ఈ సంక్రాంతికైన ఆంధ్రదేశం పోగొట్టుకున్న కాంతులన్నీ పునరుద్ధరించు కుంటూ పుడమిని పులకరింపచేస్తుందని ఆశిద్దాం. ●

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

# తెలుగు సినిమా వారిలో నారాయణమూర్తి తీరే వేరు!



ఎన్నో సంవత్సరాలుగా ఆర్. నారాయణమూర్తి చలనచిత్ర పరిశ్రమలో ఓ నటునిగా ప్రవేశించక మునుపునుంచీ చూశాను. ప్రవేశించాకా చూశాను. అతని తీరే వేరు! ఇంకా విపులంగా, వివరంగా అందరికీ అర్థమయ్యే భాషలో చెప్పాలంటే అతని రూటే వేరు. మొదట్లో అతణ్ణి దాసరి నారాయణరావు గారింటివద్ద సినిమా వేషాలకు వచ్చాడనుకోలేదు. పరిచయం లేనివారిని పరిచయం చేసుకోవడంలోగానీ, పలుకరించడంలోగానీ, కలుపుగోలుతనంలోగానీ, కలిమిడిలోగానీ, వినయంలోగానీ అతణ్ణి అతనిగా చెప్పుకోవాలి. అతనితో ఎవరినీ పోల్చిచెప్పలేము. అభ్యుదయ భావాలు కలవారూ, ప్రగతి ధోరణిలో మాట్లాడేవారూ ఎందరో నాకు తారసపడ్డారు. అలాగే ఎర్రతనంతో కుర్రతనంగా మాట్లాడేవారినీ చూశాను. కానీ ఇతని నమ్రత, విధేయత, కృతజ్ఞత, కలుపుగోలుతనం వంటి లక్షణాలు ఎవరి వద్దనూ చూడలేదు.

ఆనాడు గూడవల్లి రామబ్రహ్మం నుంచీ, తాపీ ధర్మారావు (తాతాజీ) నుంచీ చూస్తున్నాను. మాదాల రంగారావు, టి.కృష్ణ వంటి అభ్యుదయ పంథా మేధావులెందరో వచ్చారు. వీరి క్రితం సుంకర వాసిరెడ్డిలను చూశాను. కానీ ఆర్. నారాయణమూర్తిలో కల నిజాయితీ, నికార్సుతనం, విశ్వసనీయత ప్రచ్ఛన్నంగా ఉండేది. అతడు నాకు మిత్రుడూ కాడు, శత్రువు అసలే కాదు. వ్యాపార సంబంధాలు కూడా లేవు, అతని చిత్రాల ప్రకటనలు వేసీ ఎరుగను.

భారతదేశానికి ఆగష్టు 14వ తేదీ అర్థరాత్రి స్వాతంత్ర్యం ప్రకటితమైనట్టు ఆర్. నారాయణమూర్తి 'అర్థరాత్రి స్వాతంత్ర్యం' చిత్రం కథకుడు, దర్శకుడు, చోదకుడు, ప్రధాన నటునిగా చిత్రరంగ ప్రవేశం చేశారు. ప్రజాస్వామ్య మానవ సమాజంలో పౌరుడెలా ఉండాలి, కుటుంబం ఎలా ఉండాలి, అతని హక్కులు యెలా కాలరాయబడుతున్నాయ్, రాజకీయాలు, అధికారులు, పోలీసు యంత్రాంగంలో కాలుష్యం ఎలా ఉంది, వీటిలో యెలాటి మార్పులొస్తే దేశం, జనులు బాగుపడతారన్నదే నారాయణమూర్తి చిత్ర కథాంశాలు.

దేశమంటే మట్టికాదోయ్ – దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ నినాదపు అడుగుజాడల్లో అతడు నడుస్తున్నాడు. 'అర్థరాత్రి స్వాతంత్రం' చిత్రం విడుదల సందర్భములో కాట్రగడ్డ ప్రసాద్ వద్ద చూశాను. అటు తరువాత 'మయూరీ' చిత్ర పంపిణీ వారి దృక్కుల్లోపడి ఎన్నో చిత్రాలు నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తూ, నటిస్తూ తనకంటూ ఓ అభిమాన లోకాన్ని ప్రేక్షకుల్ని ఏర్పరచుకున్నారు. చిత్ర నిర్మాణం అనేది నల్లేరుపై నడకలాంటిది, ఏడు చిత్రాలు నిర్మించి, నీడలేకుండా నలిగిపోయిన నేను, నటుల్లోగానీ, సాంకేతిజ్ఞుల్లోగానీ కృతజ్ఞత అనేది, జాలి అనేదీ చలనచిత్ర రంగంలో చూడలేదు. నాకు బాగా దవడలు వాచాయ్. చీటికీ మాటికీ హాంకాంగ్, స్వీడన్, జర్మనీ, ఫ్రాన్సు, అమెరికాలు పోతున్న యీ పోటీ రోజుల్లో, గ్లామర్ తారా తారాదులు వెలిగిపోతున్న యీ పోటీ రోజుల్లో, నారాయణమూర్తి నిరాడంబరత్వం, నికార్సుతనంతో కొత్త కొత్త నటులూ, సాంకేతిక విజ్ఞులతో తనే దర్శకునిగా నిర్మాతగా సందేశాత్మక చిత్రాల్ను సామాన్య సంసారుల కథల్తో చిత్రించి విజయుడవుతున్నాడంటే ఆనందమూ, ఆశ్చర్యమూ కలుగుతుంది. అతణ్ణి చూచి చాలా రోజులైంది.

ఆడంబరానికి ఆమడ దూరంగా ఉంటూ, తానొక సినిమా నిర్మాత, దర్శకుడూ, నటుడూ అనే డాంబికాలు లేకుండా, ఓ సామాన్య పౌరునిగా ఉండే నారాయణమూర్తికి 2020 డిసెంబర్ అంతానికి మరో సంవత్సరం వయసు పెరిగిందట. ఇలా నూరు సంవత్సరాలు ఆరోగ్యంతో నారాయణమూర్తి జీవించాలని కోరుకుంటున్నాను.

**– గోటేటి**

కొన్ని సంవత్సరాల క్రితం... హైదరాబాద్ జింఖానా మైదానంలో వరద బాధితుల కోసం ఒక ప్రఖ్యాత క్రికెటర్ ఇచ్చిన ''బ్యాట్ ''వేలం జరుగుతోంది. సినీపరిశ్రమలోని మహామహులంతా ఆ వేలం పాటకు విచ్చేశారు... బ్యాట్ వేలం పాట మొదలైంది... సినీహీరోలు పాట పాడటం ప్రారంభించారు... అంతా వేలల్లోనే పాడుతున్నారు... అతి కష్టం మీద 1.5 లక్షలకు చేరుకుంది పాట... నిర్వాహకులకు నిరాశ......

అంతలో తెల్లని ఫ్యాంట్, షర్ట్ ధరించి, మాసిన గడ్డం, చేతిలో గుడ్డసంచితో వచ్చాడొక వ్యక్తి... వస్తూనే... నా పాట 8,50,000 (ఎనిమిది లక్షలా యాభైవేలు) అంటూ అరిచాడు. అందరూ నిర్ఘాంతపోయారు. అగ్రహీరోలకు సైతం నోట మాటరాలేదు... నిర్వాహకులు ఆనందంగా ఆయన పాటను ఫైనలైజ్ చేశారు.

తన వెంట తెచ్చుకున్న గుడ్డసంచిలోని డబ్బునంతా టేబుల్ మీద పోసి బ్యాట్ తీసుకొని దానిని ముద్దుపెట్టుకొని మళ్ళీ దానిని ఒక అనాథ శరణాలయానికి ఇచ్చేశాడు. నా దగ్గర అంత డబ్బేవుంది... లేకుంటే అంతకంటే ఎక్కువే పాడేవాడిని అని నవ్వుతూ చెప్పాడా వ్యక్తి... అతనే 'ఆర్.నారాయణమూర్తి' పీపుల్స్ స్టార్... దాదాపు 25 సినిమాలు తీసినా.. ఈ రోజుకీ సొంత ఇల్లులేని నటుడు... కేవలం ఒక చాప, దిండు అతని ఆస్థి, తను సంపాదించినదంతా పేదలకే పంచాడు.. ఎక్కడ తను పెళ్ళిచేసుకుంటే సమాజసేవకు ఆటంకమవుతుందో అని పెళ్ళి చేసుకోకుండానే "బ్రహ్మాచారి"గా మిగిలిపోయాడు... హీరోలంటే ఆరడగులు, అందమైన ముఖం, కండలు తీరిన శరీరం కాదు... అందమైన మనసు... నారాయణమూర్తిగారే 'అతిగొప్ప' హీరో.

Salute Naryana Murthy Garu.



# మధుర స్వరం, మధుర కవిత దేవులపల్లి కృష్ణశాస్త్రి స్వంతం

## చివరి రోజుల్లో చిగురుటాకయింది !!

ఎక్కడ ఏ యెలమావి కూసినా దేవులపల్లి కృష్ణశాస్త్రి గీతమా అన్నట్టుంటుంది! కోయిల మధుర స్వరం కృష్ణశాస్త్రి మధుర స్వరాగానికి సరితూగుతుందా అనేది కూడా అనుమానమే!

జీవితం 50వ పడిలోకి వచ్చిన కాలంలో ఆయన సినిమారంగంలో కాలూనారు! మొదటిచిత్రం 'మల్లీశ్వరి' చిత్రం కోసం ఆరేండ్లు శ్రమించారు. ఆ రోజుల్లో అలాటి దీర్ఘశ్రమ ఉండేది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఓ కుగ్రామాన జరిగిన ఓ గ్రామీణ జంటకు చెందిన ప్రేమైక కథ. సాగరంలో నీటిబొట్టులాటి విషయాన్ని తీసుకుని సాగరమంత కథను రూపొందించారు, ఇదో పెద్ద సాహసం.

ఇది చారిత్రిక యితివృత్తమూ కాదు, ఇతిహాసమూ కాదు, చారిత్రక నేపధ్యంగా చూపిన వైచిత్ర చిత్రం. రచయిత దేవులపల్లి కృష్ణశాస్త్రి, దర్శకుడు బీయన్ రెడ్డీ తీసుకున్న సాహస సంగీత రసభరిత విచిత్రమిది. చిత్రం అడుగడుగడుగునా వారిద్దరే కనపడతారంటే– దేవులపల్లివారు అన్నప్రశాన రోజుననే ఆవకాయ అన్నాన్ని రుచ్యంగా చూపించారు.

తెలుగు కవుల్లో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిదొక ప్రత్యేకశైలి. ప్రకృతీ ప్రకృతమైన అందాలను ఆయన కలంలో చూపించినట్టే కవీ చూపించలేదు.

చివరిరోజుల్లో ఆయన గళం మాట్లాడడం మానినా, కలం మాత్రం మకరందాలనే చిందించింది. మందార మాధుర్యమును గ్రోలు కవులు జన్మిస్తారని పోతన మహాశయుడు ముందే గ్రహించి ఆ పదరంజిత మనో రంజితాన్ని మకరంద సుధారసంగా కవి దేవులపల్లి రచనలో దర్శింపచేసారనుకుంటాను.

సినీగీతాలకు సాహిత్యస్థాయిని తెచ్చిన కవి, పండితుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి. 'మల్లీశ్వరి'లాంటి దృశ్యకావ్యం ఆయన చేసిన చమత్కారమే. సాంప్రదాయ కుటుంబంలో జన్మించినా సాంప్రదాయాలకు బద్ధుడిగా జీవించని వ్యక్తిత్వం దేవులపల్లిది. భావకవిత్వంతో ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించినది ఆయనే.

ఒక వ్యక్తి మహోన్నతుడిగా, మహాకవిగా మలవడం జన్మతః సంక్రమించిన ప్రతిభాపాటవాలు, వంశపారంపర్య గుణగణాలు, తల్లిదండ్రుల పెంపకమే కాక గురువుల ప్రభావం, సమకాలీన సామాజిక పరిస్థితులు కూడా పాత్ర వహిస్తాయి.

ఆ విధంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి ఇంటర్‌స్థాయిలో రఘుపతి వెంకటరత్నం నాయుడు, డిగ్రీవిద్యార్థిగా మామిడిపూడి వెంకట రంగయ్యల ప్రభావానికి గురయ్యారు. వారందరూ ఏ 'ఇజమ్'లను అనుసరిస్తున్నా ఆ 'ఇజమ్'ల ప్రభావంలోకి వెళ్ళినట్టే వెళ్ళి, బయటకు వచ్చి తనదైన స్వేచ్ఛావిధానాన్ని ఎంచుకుని, పయనించిన కవి దేవులపల్లి. దాదాపు పదేళ్లు కాకినాడలో లెక్చరర్‌గా పనిచేసి ఆ తర్వాత ఆరేళ్ళపాటు పూర్తిగా 'మల్లీశ్వరి' చిత్రరచనలో నిమగ్నమయ్యారు. అది పూర్తవుతూనే ఆకాశవాణిలో సాహిత్య ప్రయోక్తగా, ఎన్నెన్నో అమూల్యమైన నాటికలను, వాఖ్యా రూపకాలను రచించి సమర్పించారు.

కాలం కాటేసి గొంతును బలి తీసుకున్నాక కూడా కుంగిపోక తన జీవిత ఫిలాసఫీని ఎన్నటికీ మారదని స్పష్టం చేశారు. అందుకే సినీరంగంలో అంతకాలం ఉన్నప్పటికీ దేవులపల్లిది వ్యాపారధోరణి కాలేదు. ఎటువంటి ప్రలోభాలకు లొంగని అచ్చమైన సినీగేయ రచయిత. దాదాపు 50వ పడిలోకి వెళుతుండగా సినీరంగం దేవులపల్లిని పిలిచింది. ఆ తర్వాత ఆయన సినీరంగాన్ని వదిలేశారు. అరవై సంవత్సరాలు నిండిన తర్వాత కూడా దేవులపల్లిలో సాహసం ఏ మాత్రం తగ్గలేదు.

అరవై ఏడేళ్ళ వయసులో హైదరాబాద్‌నుండి తిరుపతి వరకు కారు ప్రయాణం చెయ్యటమనే సాహసం దేవులపల్లి చేశారు. అప్పటికే ఆయన గొంతు బొంగురు పోతున్నది. తిరుపతిలో ఒక సమావేశానికి వెళ్ళిన శాస్త్రిగారికి ఊపిరాడని ఇబ్బంది కలిగింది.

మద్రాస్‌లో వైద్య పరీక్ష తర్వాత గొంతు క్యాన్సర్ అని నిర్ధారణ చేసారు. ఆ విషయం దేవులపల్లి కృష్ణశాస్త్రిగారికి తెలియదు. బొంబాయికి తీసుకువెళ్ళి స్పెషలిస్టుకి చూపించి క్యాన్సర్ అని రూఢి చేసుకున్నాక గాని, ఆయనకు విషయం చెప్పలేదు.

ఆంధ్రదేశంలో తిరుగులేని వక్తగా పేరుపొందిన దేవులపల్లి కృష్ణశాస్త్రి స్వరం మూగపోయింది. ఆపరేషన్ విజయవంతం కానీ ఆయన కంఠం మూగ బోయింది. చేతిలో ఒక పుస్తకం, కలం... తన మనసులోని మాటలను కాగితం మీద రాసి చూపటమే అలవాటు చేసుకున్నారు. 67వ ఏట మొదలైన ఆ పద్ధతి 83వ ఏట ఆయన మరణించే వరకు 16 సంవత్సరాలు కొనసాగింది.

1967లో అమాయకుడు చిత్రంలో అనుకోకుండా రాసిన "అనుకోనా... ఇది నిజమనుకోనా?' అన్న పాటలో తన పరిస్థితినే ఎంచుకున్నారాయననిపించింది. దేవులపల్లి గళం పోయినా కలంలో మాధుర్యం అలాగే నిలిచివుంది. ఆ మరుసటి సంవత్సరమే మద్రాసుకి మరేదో పనిమీదవచ్చి 'ఇది మల్లెల వేళయని' అనే పాట రాయటంతో తెలుగు చిత్ర పరిశ్రమ దేవులపల్లిని వదలలేదు.

1968 నుండి దేవులపల్లిగారి పాటల తోటలు పూశాయి. ప్రతి ఏటా ఆయనదే ఉత్తమ గేయం.

తిరిగి ఆయనకు ఆంధ్రదేశంలో పలు పట్టణాల నుండి సాహితీ ఆహ్వానాలు వచ్చాయ్. ఒకనాటి ఉత్తమవక్త కంఠం మూగబోయినా ఆయన రాసిన ప్రసంగం మరొకరిచేత చదివిస్తున్నా దేవులపల్లి వేదికమీద ఉంటే చాలంటూ నిర్వాహకులు సంతృప్తి చెందేవారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ ఇవ్వాలని 1975లో భావించినపుడు సన్మానాలు, అవార్డులకు దూరం అన్నారు. బలవంతంగా ఒప్పించగా అవార్డును అందుకుని, ఆయనకు ఇష్టమైన ఊరు కాకినాడ చేరి అక్కడ జబ్బుపడ్డారు.

భారత ప్రభుత్వం దేవులపల్లికి పద్మ అవార్డ్ ఇవ్వాలనుకుంది. వారు 1966, 1972ల్లో ప్రతిపాదించినా ఆయన అంగీకరించలేదు. అలా ప్రభుత్వం యిస్తామన్న అవార్డ్‌ని ఒకసారి తిరస్కరించినవారికి రెండవసారి ఇవ్వరు. కాని దేవులపల్లి విషయంలో ఆ పద్ధతి కాదని మూడవసారి అవార్డు ఇస్తామన్న కబురు.

ఎప్పటిలాగేనే ఆయన తిరస్కరించారు. కాని పిల్లల మాటమీద 'పద్మభూషణ్' అవార్డ్‌ని అంగీకరించారు. ఆ యేడే సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. 1979లో హైదరాబాద్‌లో సన్మానం అంటే మద్రాసు నుండి హైదరాబాద్‌కి వైద్యుడిని వెంట తీసుకుని వెళ్ళారు. వారం రోజులు హైదరాబాద్‌లో హాయిగా గడిపివచ్చి సహస్ర చంద్రపూర్ణ ఉత్సవం జరుపుకున్నారు.

1980 రాకతో దేవులపల్లి ఆరోగ్యంలో కొంచెం మార్పు వచ్చింది. ఫిబ్రవరి 24వ తేదీ ఉదయం ఆయాసం అన్నారు. వైద్యులు పరీక్షచేసి కంగారులేదు అన్నారు. గుండె వైద్యనిపుణుల దగ్గరికి వెళ్ళమన్నారు. కాని దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు తానెక్కడికీ వెళ్ళనని మొండికేశారు. ఆదివారం కావటంతో వైద్యులు ఇంటికి వచ్చే అవకాశం లేదు.

సాయంత్రం ఎవరో వస్తేవారితో అరగంటకు పైగా కాగితం మీద రాస్తూనే సంభాషణ చేశారు.

వచ్చినవాళ్ళు వెళ్ళిపోయారు. దేవులపల్లికి ఆయాసం మొదలైంది. విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుందని లోపలికి వెళ్ళి పడుకున్నారు. ఆయాసం పెరిగింది. విజయా హాస్పిటల్‌వారు పంపిన అంబులెన్స్ ఇంటికి చేరేసరికి అంతా అయిపోయింది. ●

# మంజుల గాయని జిక్కీ కృష్ణవేణి, మధుర గాయకుడూ సంగీత దర్శకుడూ ఏ.ఎం. రాజా దంపతుల చివరి జీవితం విషాదాంతం!

ఇప్పటివారికి జిక్కీ కృష్ణవేణి అంటే తెలియదు. కొంతమంది అయితే మీర్జాపూర్ కృష్ణవేణా – అని అడుగుతారు. ఎందుకంటే ఈ కృష్ణవేణి తెరమీద కనిపించింది కానీ – ఆ కృష్ణవేణి తెరవెనుక మంజుల గాయనిగా భాసించింది. ఎన్నెన్నో మధురమైన సినిమా పాటలు పాడింది.

అలాగే ఏ.ఎం. రాజా – అతనిదో చక్కని గాత్రం 'విప్ర నారాయణ' చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావుకీ, 'షావుకారు' చిత్రంలో ఎన్టీ రామారావుగారికీ గొంతెరువిచ్చారు. సాలూరి రాజేశ్వరరావుగారు 'రాజా'కు చక్కని అవకాశాలు యిచ్చారు.

తరువాత రాజా 'పెళ్ళికానుక' చిత్రానికి సంగీత దర్శకత్వం వహించి, పలు సంవత్సరాలు జ్ఞాపకం ఉండే పాటలకు స్వరాలు కూర్చారు. జిక్కీ కృష్ణవేణీ, ఏ.ఎం. రాజాలు పెండ్లి చేసుకుని సుఖసంసారం చేసారు. ఎవరి కనుదృష్టిపడిందో తెలియదు కానీ రాజా సినిమా జీవితం ఎక్కువకాలం సాగలేదు. జిక్కీ కృష్ణవేణి చాలా కాలం సినీ నేపథ్య గాయనిగా, అవిశ్రాంతంగా కొనసాగింది. ఎక్కువ పాటలు పాడింది. అంత అధికంగా చిత్రాలకు పాడుతూ కూడా డబ్బును నిలువ చేసుకోలేకపోయింది; ఏ దురలవాట్లు లేవు.



*'సంసారం - ప్రేమ సుధ' పూరం - నవజీవన సారం అనేది జిక్కీ - ఏ.ఎం. రాజాల జంట*

రాజా జిక్కీలు ఇరువురూ గానకచ్చేరిలకు వెళ్ళేవారు. ఒకసారి యిరువురూ దక్షిణాది కెక్కడికో కచ్చేరికి రైలులో వెడుతూ మధ్య స్టేషన్‌లో కాఫీ ఫలహారములకోసం రాజా దిగి, రైలు బయలుదేరడంతో తన కంపార్టుమెంటు యెక్కబోతూ ప్రమాదానికి లోనై ప్రాణాలు కోల్పోయాడు. ఇది జిక్కీ కృష్ణవేణి జీవితంలో తగిలిన కోలుకోలేని దెబ్బ.

సినిమా రంగం చిత్రవిచిత్రమైంది. ఏ దురలవాట్లు లేనివారిని సహితమూ వారి స్థాయిలో వారిని నిలువనీయదు. క్రింద అగాథంలోకి త్రొక్కివేస్తుంది. రాజా చాలా మంచివాడూ, సంగీతజ్ఞాని! వ్యక్తిగత గౌరవాన్ని చంపుకుని, ఒదిగి ఉండే స్వభావి కాదని నేను గ్రహించిన విషయం! ఏమైతేనేంవి అంత మంచి గాయకుని జీవితం విషాదంగా ముగిసింది.

ఇక జిక్కీ కృష్ణవేణి ఎన్నో చక్కని పాటలు పాడింది. ఎంతో సంపాదించింది. కానీ ఏంవీ నిలవచేసుకోలేకపోయింది. ఆర్థికంగా స్థిరపడలేదు. చివరిదశలో ఆమెకు భయంకరమైన 'కాన్సర్ వ్యాధి సోకింది. రాబడిలేదు. వ్యాధికి చికిత్స చేయించుకోవడానికి డబ్బు లేదు. ఆమెకూ, మరో ప్రఖ్యాత గాయని జమునారాణికీ మంచి స్నేహం! వారిద్దరూ ఒకే కాలంలోనే సినిమారంగంలో గాయనులుగా ప్రవేశించారు. జిక్కీ యొక్క గాన వైభవాన్ని జమునారాణి చూచింది. ఇద్దరూ మంచి స్నేహితురాళ్ళు. జిక్కీ చికిత్స కోసం జమునారాణి చారిటీ సంగీత కచేరీలు చేయడం, అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి ద్వారా లక్ష రూపాయలు, తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత గారి ద్వారా ఎం.జి.ఆర్. ట్రస్టు నుంచీ రెండు లక్షల రూపాయలు సాయం అందింపజేసినా ప్రయోజనం లేకపోయింది. జిక్కీ కృష్ణవేణి శరీరంలోని కాన్సర్ కణాలు శరీర భాగాలకు విస్తరించి 2004 సం॥ములో 'జిక్కీ కృష్ణవేణి మరణించింది.

ఓ రకంగా ఏ.ఎం. రాజాను 'విధి' బలిగొన్నది. ఓ భయంకర వ్యాధి కారణంగా జిక్కీ కృష్ణవేణి మరణించింది! ఈ సుస్వర శ్రవ్య జంటను ప్రజలుగానీ, ప్రభుత్వంగానీ గుర్తించడం లేదు సరికదా; పరిశ్రమకూడా తన జ్ఞాపకం నుంచీ తీసివేసింది. గ్రామఫోను రికార్డులు లేకపోవడంతో వారి పాటల రికార్డులను భద్రపరచుకోలేకపోతున్నాం. ఆనాటి పాతమధురాలను జ్ఞాపకం చేసుకోవడానికి నా మనః ఫలకంపై ముద్రింపబడిన విషయాలనే ఇందుపొందుపరిచాను. ఆ అలనాటి విగత గళస్వర మాధురిలకు వినయాంజలి సమర్పిస్తున్నాను. ●

## జిక్కీ పాడితే...

*మదిపులకించని మది పులకించు, ఒళ్ళంతా జిల్ జిల్లులాడుతుంది. రారే రారే పిల్లల్లారా బొమ్మల పెళ్ళిచేదాము. అందగాడే బలే సోగ్గాడే, అనార్కలి చిత్రంలో 'రాజశేఖరా – నీ పై మోజు తీరలేదురా! జీవితమే సఫలమూ రాగసుధా భరితమూ ప్రేమ సుధాపూరము. రాక రాక వచ్చావు చందమామా – లేకలేక నవ్వింది కలువభామా! పందిట్లో పెల్లవుతున్నాదీ – నీ పేరు విన్నా నీ రూపు కన్నా ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతం – అందచందాలవాడు, పదుచుతనం రైలు బండిపోతున్నది. అందచందాల సొగసరివాడు, చెట్టులెక్కగలవా నరహరీ – చిలుకాగోరింకా పలికే పకా, ఓహో బస్తీదొరసానీ, ఏరువాకా సాగాలో రన్నారన్నన్నా – ఇవి సూపర్‌డూపర్ హిట్టుపాటలు. సువర్ణసుందరిలో 'హాయి హాయిగా ఆమని సాగే' పాట చాలా మంచి హిట్టు.*

*కొంచెం ఇంచుమించు తెలుగు, మలయాళం, సింహళం, తమిళ, కన్నడ దక్షిణాది భాషల్లో 10 వేల పాటలు పాడిన క్లాస్‌వన్ గాయనీమణి. అచిరకాలం లోనే ఏ.ఎం. రాజా గాయకుడు, సంగీత దర్శకు డైనాడు. భర్తాభార్యా రెండు చేతులా సంపాదన. రాజా ప్లేబాక్ గాయకునిగా, సంగీత దర్శకునిగా బాగా సంపాదించాడు. వీరికి నలుగురు అమ్మాయిలు. ఇరువురు అబ్బాయిలు సంతానం. పాటబిజీలో వాళ్ళచదువులెలా సాగాయో తెలియదు. చివరకు ఆమె క్యాన్సర్‌తో మరణించారు.*

**అవ్వనంటే కాదనిలే – కాదంటే అవ్వననిలే!**
**ఆడవారి మాటలకు అర్థాలే వేఱులే – అర్థాలే వేరేలే!**
**అన్న పాట గాత్రధారి ఏ.ఎం. రాజాయే!**

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది
అంబికా దర్బార్‌బత్తి





# ముక్త్యాల ముత్యం ఆంధ్రా ముక్తాఫలం ముక్త్యాల రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్

కృష్ణా తీరవాసి, వాసిగొన్న రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వరుడు రాజకపు జమీందారు మనంబులో పుట్టి తనదైన లక్షలకు లక్షల రూప్యములు (ఈనాటి కోట్లకు కోట్లు సమానం) సొంత సొమ్మును జలంలా ఖర్చుపెట్టడమే గాక, ఇద్దరు బ్రిటిష్ ఇంజనీర్లను కల్నల్ ఎల్లిస్, కల్నల్ మాల్లింగ్స్‌ను తయారించిన రెండే వేల పుటల దీక్ష నివేదికను స్ఫుటీకరించి, తత్సారాన్ని కరపత్రాలుగా వేయించి, దాదాపు ముప్పైవేల మైళ్లు తిరిగి, గ్రామవాసులను మేలుకొలిపి, మహాజర్లపై సంతకాలను చేయించి, టెలిగ్రామ్‌ల్ను పంపడం జూచి, ఆనాటి ప్రాజెక్టుల మంత్రి గుల్జారీలాల్‌నందా గారి ఆశ్చర్యానికీ, అభినందనకూ గురియైన ముక్త్యాల ముత్యాల పురుషవరేణ్యుడు రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వరప్రసాద్‌కు నేను, ఆయన్ను ప్రసాద్‌కు ముందు 'వర' చేరుస్తూ, రామగోపాలకృష్ణ మహేశ్వరుల వరప్రసాద్‌గా కీర్తిస్తున్నాను.

ముత్యాల ముక్తాఫలం రాజావారు చేసిన కృషీ ఇంతా అంతానా – మైసూరు ప్రభుత్వంలో ఉద్యోగ విరమణం చేసిన చీఫ్ ఇంజనీరు నరసింహయ్య, ప్రజాపనుల శాఖ గోపాలాచార్యులను తీసుకుని వచ్చారు. వారిచే ఆ ప్రాజెక్టు ఉపయోగ విశేషాల్ని తయారుచేశారు. వారికి ఆయనే జీతాలు చెల్లించారు. జలవిద్యుత్ సాధించవచ్చనీ, వేలకొలది ఎకరాలు సాగుచేయవచ్చుననీ, కోట్ల ఎకరాలు సస్యశ్యామలమవుతుందనీ, కృష్ణా నీరు వృధాగా సాగరంపాలు కాకుండా అదుపు చేయవచ్చుననీ – ఎందరెందరో ప్రభుత్వ అధికారులకు తెలియచేశారు. ఎన్నో ఒడిదుడుకులకు లోనయ్యారు. అయినా పట్టుదల వీడలేదు. అపర భగీరథునిలా ఆటుపోట్లను నిభాయించుకున్నారు.

మానవునికి భగవంతుడు ప్రత్యేక వరాన్నిచ్చాడు. జ్ఞాపం, జ్ఞానోత్పత్తి మానవుడికి భగవంతుడిచ్చిన మేధస్సు ద్వారా యిచ్చిన జ్ఞానాన్ని, రాజకుటుంబ యశస్సు ద్వారా లభించిన ధనాన్ని, ఆయన వినియోగించుకుని మానవ లోకానికి వెలుగు, సమాజానికి బ్రతుకు తెరువు, దేశ ప్రగతికి మదుపు కల్పించడంలో మహేశ్వర ప్రసాద్ మనిషికి ప్రసాదింపబడిన జ్ఞానాన్ని దేశ వనరుల అభివృద్ధిపై సారించి 'మహా మహనీయుడ'నిపించుకున్నారు. ఇలాంటి మహత్పురుషుడు జన్మిస్తాడని ఏమో ఆనాటి సార్వభౌములు ఈ వంశానికి 'వాసిరెడ్డి' అనే బిరుదమును ప్రసాదించారు. నిజానికి ముక్త్యాల రాజులు కమ్మ వంశీయులు. 'నియోగి'లకు 'రాజు' బిరుదు ప్రసాదించినట్టుగానే – ఈ వంశీకులకు 'వాసిరెడ్డి' బిరుదు ప్రసాదించబడి 'వంశ' నామంగా వరలుతూంది. అది రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్‌తో సార్థకమైంది.

ఈ ప్రాజెక్టును నిర్మించకుండా చేయాలని మద్రాసు ప్రభుత్వం ఎన్నో ఆటంకాలను సృష్టించింది. కపటోపాయాలను పన్నింది. భోస్లా కమిటీ అక్కడకు వెళ్ళడం కష్టమనీ అదంతా అడవి యనీ, రోడ్డు మార్గం లేదనీ అన్న వార్తను అప్పటి జల సంస్థ డైరెక్టర్ కె.ఎల్.రావు గారు ఆలోచించి, ముక్త్యాల రాజాగారికి ఈ వార్తను చేరవేస్తే ప్రయోజనం ఉంటుందని భావించి, వార్తనందించగా అప్పటికప్పుడు రాజాగారు స్పందించి, ఇరవై కిలోమీటర్లు పొడవునా చెట్లను నరికించి, నక్కా రోడ్డును వేయించి, మార్గం సుగమం చేశారు.

ఈ ప్రాజెక్టు నిర్మాణ విషయంలో ఇంజనీర్ డా॥ కె.ఎల్. రావుగారి పాత్ర గణనీయమైంది. రాతికట్టడంతో ఈ ప్రాజెక్టును నిర్మించడం శ్రేయస్కరం అంటూ, రాతి నమూనాలను అమెరికాలోని 'డెన్వర్'కు పంపించి, పరీక్షింపచేసి ఆ రాళ్లతో 30 వేల మంది కార్మికులు, 10 సం॥ములు నిరంతర శ్రమచేయగా ఈ ప్రాజెక్టు రూపులు దిద్దుకుంది. అప్పటి ఆంధ్ర గవర్నర్ త్రివేది, డా॥ కె.ఎల్. రావు, ముక్త్యాల రాజా, మోటూరి సత్యనారాయణ వివిధ రాజకీయ నాయకులు ఈ ప్రాజెక్టుకు కారణభూతులుగా– ఆనాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ ఈ ప్రాజెక్టును ఆవిష్కరిస్తూ, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రాజెక్టుగా నాగార్జున సాగర్ ప్రాజెక్టును అభినందించారు.


'ధనం మూలం ఇదం జగత్'యని, రాజ్యాలు పోతున్నాయ్, ధనంను మూట గట్టుకుని, తన భార్యా, పిల్లా పాపలతో సుఖయాత్ర చేద్దామని గాకుండా, చేతనైనంత దేశ సేవ చేద్దామనీ, వట్టి మాటలతో కాలం గడపడం కాదనీ, ఘట్టి మేల్ తలపెట్టిన రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వరప్రసాద్ నిర్విరామ, నిస్వార్థ, చిత్తశుద్ధీ ఫలితం ఈ నాగార్జున సాగరం డాము నిర్మాణం.

ఆనాడు గానీ ఈనాడు గానీ ధనికులూ, జమీందార్లు ఎందరు లేరు. ప్రజా సేవాతత్పరుడు, సాహితీ వేత్త, సరసుడు, కళా ప్రియుడు, దేశభక్తీ పరుడూ వితరణశీలి యైన ముక్త్యాల రాజా వాసిరెడ్డి రామగోపాల కృష్ణ మహేశ్వరప్రసాద్ గారికి సాటి రాగలవారు ఆనాడు గానీ ఈనాడు గానీ ఒక్కరున్నారా? ఒక్కరు లేరు.

**పాడిపంటలు పొంగి పొర్లే దారిలో నువు పాటు పడవోయ్**
**తిండికలిగితే కండ కలదోయ్ కండకలవాడేను మనిషోయ్–** అన్న గురజాడ మాటనైనా–

ముక్త్యాలరాజా రామ గోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్‌గారికి నామకరణం ఏ సుముహూర్తాన చేశారో గానీ– బాల్యం నుంచీ అడుగడుగునా ఆయనకు మహా కవుల ఆశీస్సులు లభించాయ్. సరస్వతీ పుత్రుల ఆశీస్సులు వృధాకావన్నారు వీరభోజుడు, సాహితీ సమ రాంగణా చక్రవర్తి కృష్ణదేవరాయలు.

ముక్త్యాల రాజావారికి తండ్రిగారే గురువులు. చిన్నప్పట్నుంచీ సాహిత్యంపై మక్కువగొనేట్టు చేశారు. రాజావారి ప్రతీ జన్మదినోత్సవానికి కవులను పిలిచేవారు, వారి ఆశీర్వచనములు బిడ్డకు గైకొని కవులను సత్కరించేవారు.



తొమ్మిదవ ఏట రాజా వారికి జరిగిన జన్మదినోత్సవ సభలో– అన్నమాచార్య ప్రతిభను వెలికి దీసిన పరిష్కృత కవి వేటూరి ప్రభాకర శాస్త్రి గారు తమ 'నీతి నిధి' గ్రంథాన్ని అంకితం చేస్తూ–

**"చిగురుటాకులు బోలు**
**చిన్నారి నీకేలు**
**కలికి పలుకుల గోము**
**గల ముద్దు**
**నీ మోము**
**నెన్నెన్ని విద్యలు**
**నేర్చవలెనో**
**నెనరు చెప్పిరి చూడు**
**నీ కన్నులగల నిండు**
**సిరుల సందరి**
**గటాక్షింపవలెనొ,**
**వంశదీపకుడవైన**
**నీవలన నింక**
**కులమునకునెంత సమృద్ధి నొసగవలెనొ,**
**వంశదీపకుడవైన నీవలననింక**
**కులమునకు నెంత విఖ్యాతి కలుగవలెనో**
**వృద్ధు నొందుమా యివి యెల్ల వెల్లడింప**
**మహిత తేజ! ముక్త్యాల కుమార రాజ!"**

–శాస్త్రిగారేనోట బలికారో గానీ– సత్కృతీ చర్యగా నాగార్జున సాగర్ ప్రాజెక్టు వేల యేండ్ల శాశ్వత కీర్తిని గొనితెచ్చింది, ఎందరో కవులను ప్రోత్సహించిన కారణంగా ఆ సిరులన్నీ కృష్ణా ప్రావా హిక ప్రాంతంలో ఎందరో సత్కవులు సాహితీ సేవ యొనర్చేట్టు చేసింది. పత్రికల్ను ప్రారంభించేట్టు చేసింది. పత్రికా రచయితలు ప్రవర్ధిల్లారు. వంశ దీపకుడైన ఆయనకు వేలువిడిచిన మేనమామ కుమార్తె సౌ॥ రాజ్యలక్ష్మీ ఇల్లాలు అయింది. ఆమె కూడా జనసేవకురాలే, ఆయన కుమార్తెల్లోని పెద్దకుమార్తె గౌరీదుర్గా సౌభాగ్య రత్నకుమారి 'అన' ఈనాటి ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రపంచంలో పెనవేయిస్తున్న వాత్సల్య రాశి శ్రీమతి వెలగపూడి ఇందిరాదత్, ఇందిరాగాంధీ అంతటి నాయకురాలయ్యింది. ఈమెను అత్తవారింట్లో అందరూ అపురూపంగా 'ఇందిరా' అని పిలువడంతో గౌరీదుర్గా సౌభాగ్యరత్నకుమారి 'ఇందిరాదత్' అయి, అటు బ్రహ్మాండ వ్యాపార రాజ్యమైన కె.సి.పి. రాజ్యాన్ని పాలించడమే గాకుండా 'సార్క్ దేశాల మహిళా పారిశ్రామలకు అధ్యక్షురాలై ప్రపంచ నాయకీమణిగా జేజే లందుకుంటున్నారు.

అటు తరువాత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు తన శ్రీమద్రామాయణ కల్ప వృక్షం'లో యీ కుమార రాజావారిని ప్రశంసిస్తూ–

**'చిరునవ్వు నవ్వెనా! చిన్నారి ముత్యాలు**
**ప్రోవులు ప్రోవులు పోసినట్లు–**
**కనులెత్తి చూచెనా! కప్రంపుజి పొదు**
**లుప్పుని తీగగా నూదినట్లు**
**ఒక యింత నడచెననా! యోగి ధిల్లీ భోగాల**
**రాశి లాభము కొల పోసినట్లు,**
**పన్నెత్తి యాడెనా ప్రభుత విస్మృత పద్ద**
**సాధు భావము బారసాచినట్లు.**
**మంజుల వినీత వేషుడు మధురమూర్తి**
**యార్ద్ర భావుడు కుదిమట్టమైన బొమ్మ**
**బాల రాఘవుల వలె బిత్రువాక్యపాల**
**నా నినీషా మనీషా సనాతమర్షడు!**



యువరాజ పట్టాభిషేకంలా వారి 21వ జన్మదినోత్సవం వైభవంగా జరిగింది.

**'మీ మూర్తిగ న్గొన్న మేలి సిరుల్గార్యు**
**శాంత గుణంబు విశాల హృదయ**
**మీ మూర్తి గన్గొన్న మేలిల్లు సౌజన్య**
**గుణము మహాసుధీ జనవరేణ్య**

రాజాగారికి సంసారమొక వైపు, సంస్థాన జనులొకవైపు. సంసారయశస్సుతో బాటు దేశ శ్రేయస్సు కూడా– ఆయన కొక దీక్షాపథకమైంది. తండ్రిగారు సంస్థాన పాలన అప్పగించారు–

గార్హస్థ జీవితం మూడు పూవులుగా ఆరు కాయలుగా సాగుతూంది. గౌరీదుర్గా సౌభాగ్యరత్నకుమారి, ఉమాకుమారి, రమాకుమారి– అను ముగ్గురు కుమార్తెలు. వారందరికీ ఋణానుబంధంగా బంధువులసుబంధాలనే ఆయన చేశారు. తనను కన్న దేశాభ్యున్నతికి తానేవి చేయాలన్నదీ భగీరథునిలోలె తపస్సు చేసినట్టు చేసిన రాజన్యుడు ముక్త్యాల రాజా! తరతరాలుగా జ్ఞాపకం ఉంచుకోదగిన తెలుగు తేజం.●

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# జనవరి 19న
# విజయ దుర్గా పీఠాధిపతులు
# వెదురుపాక 'గాడ్'గారి పుట్టిన రోజు
# గ్రామ దేవత పండుగలా సాగుతూంది!



తూ తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రికి ఓగంట ప్రయాణం చేస్తేచాలు, రాయవరం మండలంలో ఉన్నది వెదురుపాక. వెదురు పాకలో అసలు సిసలు గ్రామీణ వాతావరణం కనిపిస్తూంటుంది. రాయవరము నుంచి ఓ పంటకాలువ ప్రక్కనున్న, పడుచుపిల్ల నడుములా ఉండే ఓ బాట మీదుగా వెళ్ళాలి. ఎదురుగా ఏదైనా బండిగానీ, కారుగానీ ఎదురొస్తే, ఘోషాగల స్త్రీలా ప్రక్కకు ఒదిగిపోవాలి. బాటకో ప్రమాన కాలువ అయితే, మరో ప్రక్క ఇటుకలు తయారుచేసే ఇటుక ఆ మలూ, పంటపొలాలూ, ఊరి పొలి మారులకు వెళ్లేసరికి విజయదుర్గా పీఠం అని పెద్దబోర్డూ, ఆ ప్రక్కన గాడ్ గారి బొమ్మా కనిపిస్తుంది– తరువాత పాఠశాల– తరువాత నేను మారిపోలేదుసుమా – అనే ఓ మెయిన్ రోడ్డూ– ఆ రోడ్‌లో బస్సులూ వెడతాయ్. ఆ బస్సులు ఆగే చోట ఎదురుగా 'గాడ్'గారి విశాల భవంతి ఉంటుంది. చూడడానికది రెండు మండువా లోగిలిలా ఉంటుంది. గాడ్ గారి పుట్టిన రోజుకు ముందుగా సంక్రాంతి వచ్చి వుంటుంది. కాబట్టి వీధుల్లో పెద్ద పెద్ద దూలాలతో కాలుతున్న భోగిమంటల ఆనవాళ్లుంటాయ్.

గోదావరీ పరివాహిక ప్రాంతమైన ఒక్కొక్క ఊరు ఓ ప్రత్యేకతను సంతరించు కుంది. రాజమండ్రి వద్ద గోదావరీ నది సప్తవాహికలుగా చీలి, కోస్తా, ఆంధ్ర అంతటా ఫలసాయం చేస్తూంది. పంచారామ శివక్షేత్రా లన్నీ ఉభయ గోదావరిల్లోనే ఉన్నాయ్. అనేకమంది ఋషులు, మునులూ, యోగులూ, వేద వేదాంతవిదులూ గోదావరీ పరివాహిక ప్రాంతాల్లోనే ఉన్నారు. దేశానికి అన్నపూర్ణయిన ధాన్యాగార రాశి ఆంధ్రప్రదేశ్ అంతర హృదయం, ఆయువుపట్టూ ఉభయ గోదావరీ ప్రాంతమే!

ఆయన పుట్టిన 19వ తేదీన అపురూప పర్వదినంగా అందరూ భావిస్తూ, ఆయన ఆశీస్సుల కోసం తహతహలాడుతూ, తండోపతండాలుగా దర్శించడం ఆనవాయితీ. 13, 14 తేదీల్లో ప్రారంభింపబడిన సంక్రాంతి పర్వదినములు వెదురుపాకలో ఎంతో ఉత్సాహంతో 19వ తేదీ సంధ్యా సమయం వరకూ వెదురు పాకలో కొనసాగడం అక్కడి జనుల వార్షిక ఆచారం.

విజయదుర్గా దేవి దర్శనం, గురువుగారి అమృత హృదయం దర్శించి తరించాలే తక్క వ్రాయనలవి కానిది. వారి సత్కారం పొందడం కూడా పూర్వజన్మ సుకృతం. వారి వాక్కూ అమృతవాక్కూ, ఉభయగోదావరి జిల్లాల్లోనే గాకుండా ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రేతర రాష్ట్రాలు, సాగరాలను దాటిన దేశాల్లో సహితమూ వారి భక్తులున్నారు.

వెదురుపాక లోని వారందరూ 'గురువు'గారంటూ ఎంతో ప్రేమగా పిలుచుకుం టారు. డెభైరెండేళ్ల క్రితం వారి అమ్మమ్మ 'గాడ్' అని పిలిచింది. అప్పటి ముహూర్తం ఏమోకాని ఇప్పుడాయన 'గాడ్' వెదురుపాక గాడ్ అయిపోయారు.

అందరిలానే ఉద్యోగం చేసుకొనే ఆయనకు ఓ శుభదినం నాడు విజయదుర్గ ప్రత్యక్షమై, నాలుకపై నాలుగు మంత్రవాక్యములను వ్రాసింది. అప్పట్నుంచి ఆయన ప్రతిభ, మహిమలూ గోదావరి, కృష్ణానదుల్ని దాటి, అటు విశాఖ సాగరాన్ని దాటి విదేశాల వరకూ వెళ్లిపోయింది. పలుచోట్ల పలుదేశాల్లో, పలుప్రదేశాల్లో ఆయన పేరూ, మహిమలు వ్యాప్తి అయ్యాయి. హైదరాబాద్, చెన్నయ్, ముంబాయి నగరాల్నుంచి భక్తులు వస్తారు. వెదురుపాకలో రెండు మూడు రోజుల పాటు పండుగ వాతావరణం ఉంటుంది.

ఆయనందరినీ ప్రేమగా అబ్బాయి, అమ్మాయి, తమ్ముడూ, బావా, ఏరా యని ఆత్మీయంగా పిలుస్తూ, అత్యంత కలుపుగోలుతనంగా ఉంటారు, మాట్లాడతారు, దగ్గరకు తీసుకుంటారు. అందుకే జనవరి 18, 19 తేదీలు వెదురుపాకలోని గాడ్‌గారు ఉన్న నాలుగు వీధుల కూడలి ఇసుక వేస్తే రాలని జనంతో ఉంటుంది. ఓవేళ వర్షం కురిసినా నేలపై ఒక్క చినుకు కూడా పడదు. అంటే జనమయం అంత ఇరుగ్గా ఉంటుంది.

గాడ్‌గారు ఆరాధించే విజయదుర్గను చూడటానికి రెండు కళ్లూ చాలవు, ఆ దేవత అంత ప్రశాంతంగా ఉంటుంది. వచ్చినవారందరూ స్వయంగా పూజ చేసుకొనే అవకాశం ఉంది.

ఆశ్రమాధికారి సకల సదుపాయాల్నీ దగ్గరుండి చూస్తారు. ఎవరికీ ఏలోటూ రానీయరు. గాడ్‌గారి అసలు పేరు – వాడ్రేవు సుబ్రహ్మణ్యంగారు. కానీ ఆ పేరు ఆ ఊరివారికే తెలియదు. అందరూ గురువుగారూ. గాడ్‌గారని అనడమే రివాజు. పూర్వపు గ్రామ సౌభాగ్యాన్ని దర్శించాలంటే వెదురుపాక వెళ్లి తీరాలి. అక్కడివారు 'గాడ్' గార్ని గురువుగారు అంటూ చూపే గురుభక్తిని చూచి తీరాలి.

నేనన్నవన్నీ నిజమౌనో కాదో– మీరే తెలుసుకోండి! జనవరి 19 సూర్యోదయం కాగానే వెదురుపాక చేరండి. ●



## త్యాగమూర్తి, రైతు బాంధవ్యుడు, చిత్తశుద్ధిగల గొప్ప రాజకీయవేత్త

# కడప కోటి రెడ్డి

ఇంతటి సుదీర్ఘ రాజకీయ జీవితం, శాసనసభ్యునిగా సామాన్య జన సేవా చేసి, జనుల్లో నిలిచిపోయిన రాజకీయ ఘనుడు కడప కోటిరెడ్డి మాత్రమే. ఆయన పాలనాదక్షతనూ, విశిష్టతనూ చెప్పుకుని, ఆయన్ను గూర్చి చెప్పుకోవడం సమంజసమను కుంటున్నాను.


దేశానికింకా స్వతంత్రం సిద్ధించలేదు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారి 1946 సం॥ మంత్రివర్గంలో దేవాదాయ ధర్మాదాయ శాఖలతో బాటు, ఎక్సైజు శాఖను కూడా నిర్వహించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు, మధుర, తిరునల్వేలిలోని వివిధ పీఠాధిపతులనూ, ధర్మకర్త మండళ్లనూ ఆయన సమావేశపరిచి హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించిన ధీరోదాత్తుడు కడప కోటిరెడ్డి. ఎక్సైజ్ శాఖామంత్రిగా మద్యపాన నిషేధం విషయంలో తీవ్రమైన కృషి చేసిన ఘనాపాటి కోటిరెడ్డి. అవిభక్త మద్రాసు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం హరిజనులకు దేవాలయ ప్రవేశం చేయించిన ఖ్యాతి కోటిరెడ్డిగారికే దక్కుతుంది. 1953 సం॥ములో ఆంధ్రరాష్ట్రం ఏర్పడి ప్రకాశం పంతులుగారి ముఖ్యమంత్రిత్వమున ఏర్పడిన మంత్రివర్గములో శ్రీ కోటిరెడ్డి గారిని రెవెన్యూ శాఖా మంత్రిగా పంతులు గారు నియమించారు. కోటిరెడ్డి పనితీరును గ్రహించిన ప్రకాశం పంతులు వారికి ముఖ్యమైన రెవెన్యూ శాఖను అప్పగించడం గొప్ప విషయం. ఆయనకు పరీక్షయా అన్నట్టు, ఆయన మంత్రిగా ఉన్నప్పుడే రాయలసీమ దుర్భర కరువు కోరల్లో చిక్కుకున్నది. ఆయన కరువు నివారణా సంఘాధ్యక్షులుగా ఉంటూ, ప్రజల్నుంచీ విరాళాలు స్వీకరించి, కరువున్న ప్రతీచోటా – ఒక అంగుళ స్థలమైనా విడువకుండా గంజి కేంద్రాలను నిర్వహించడం, ప్రజలకు ఆహారం అందేట్టు చేయడంలో స్వయంగా పర్యవేక్షణ చేశారు. ఈ సంఘం మనుష్యులకు తిండీ బట్టా, గూడు విషయాల్లోనే గాకుండా, పశువులకు గ్రాసం కూడా అందజేశారు. గ్రామగ్రామాల్లో సంఘ కార్యకర్తలను పర్యవేక్షకుల్నీ నియమించి – అందరికీ అందేట్టు చూచిన ప్రజామంత్రి కోటిరెడ్డి.

కోటిరెడ్డి సర్వసాధారణ వ్యక్తిగా ఉండేవారు. నిరాడంబరుడూ. శాంతమూర్తి, నిష్కల్మష హృదయులు, నిర్మలచిత్తులు. సత్యమూర్తి, సత్సంకల్ప హృదయులు. మితభాషి, సత్యాన్వేషి వీటన్నిటినీ మించిన మంచి వక్త. వేంకటేశ్వర, ఆంధ్ర విశ్వ విద్యాలయాలు కోటిరెడ్డిని గౌరవ డాక్టరేటు పట్టాతో గౌరవించాయ్.

1946 సం॥ములో జరిగిన ఆంధ్ర పితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు గారి షష్ఠాబ్ది ఉత్సవాలకు శ్రీ కోటిరెడ్డిగారే అధ్యక్షత వహించారంటే – ఆయనకు సంఘంలో కల ఉన్నత స్థానం తెలియకపోదు. కడప జిల్లాలో కోటిరెడ్డే కాంగ్రెస్, కాంగ్రెస్ కోటిరెడ్డి అనే నానుడి ఉండేది. అంతటి ప్రఖ్యాతి, చిత్తశుద్ధి కల నాయకుడాయన. ఆంధ్రప్రదేశ్‌లో అందరికన్నా ఎక్కువకాలం నలుబది సంవత్సరాలు శాసన సభ్యునిగా ఉన్న గౌరవము ఆయనకే ఉన్నది. ఆయన రైతు బాంధవుడనీ, పేదల పాలిట కల్పవృక్షమనీ, ప్రకాశం పంతులుగారి నమ్మినబంటాయనీ, దైవభక్తుడనీ ప్రతీతి. కోటిరెడ్డి గారే గాకుండా ఆయన అర్ధాంగి రామసుబ్బమ్మ దంపతులిద్దరూ రాజకీయ రంగంలో సుప్రసిద్ధులు.

కోటిరెడ్డిగారిది కొంచెం కోలముఖం, పాలం విశాలం. మీసాలా కోరమీసాలు. ఒక మీసం దేశానికీ, మరో మీసాన్ని చిత్తశుద్ధికీ అంకితం చేసిన వ్యక్తి. ఆయనొకసారి జైలుకు వెళ్లినప్పుడు మీసాల్ను తీసివేయగా, రామసుబ్బమ్మ గారు మీసాన్ని పెంచండి అన్నది. అప్పట్నుంచీ ఆయన మీసాల్ను తీయలేదు. ఒడిసిగట్టి త్రిప్పనూ లేదు. ఆ దంపతుల పరస్పర ప్రేమ, ఒకరిపట్ల ఒకరికి గౌరవం అలాటిది. స్వాతంత్ర్యోదమం లోనూ, ఆంధ్రోద్యమంలోనూ కోటిరెడ్డి దంపతులు ప్రధానమైన పాత్ర వహించారు. 1950 సం॥ వరంగల్ పట్టణంలో జరిగిన విశాలాంధ్ర మహాసభలో కోటిరెడ్డి పాల్గొన్నారు. ఉద్యమం విజయవంతం, వేగవంతం చేశారు.

నిజానికి కోటిరెడ్డిగారి జన్మస్థలం కడప కానే కాదు. చిత్తూరు జిల్లా మదనపల్లి తాలూకాలోని కోటిరెడ్డిపల్లి గ్రామం. 1886 సం॥ములో ఆయన అక్కడనే జన్మించారు. ఆయనది అసలు సిసలైన వ్యవసాయదారుల కుటుంబం. పట్టుదలతో విద్యాభ్యాసం సాగించారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండీ బి.ఏ. పట్టా అందుకున్నప్పటికినీ తృప్తిని పొందలేదు. తండ్రిగారి ప్రోత్సాహంతో లండన్ వెళ్లి మిడిల్ టెంపుల్‌లో బార్‌ఎట్ లా డిగ్రీ తీసుకున్నారు. ఇంగ్లాండు నుంచీ తిరిగివచ్చిన తరువాత, కడప పట్టణం వచ్చి న్యాయవాది వృత్తిని చేబట్టారు. ఆ వృత్తిలో ఆయనకు ధనార్జనపై దృష్టి లగ్నం కాలేదు. అప్పటికే రాయలసీమ క్షేత్రంలో ప్రముఖులుగా వున్న గాడిచెర్ల హరి సర్వోత్తమరావు, కల్లూరి సుబ్బారావు, పప్పు రామాచార్యులు వంటి వారితో కలిసి స్వాతంత్ర్యోద్యమ వ్యాప్తి కోసం అవిరళ కృషిచేశారు. రాజకీయరంగంలో అందర్నీ కలుపుకుంటూ ఆంధ్ర ప్రాంతం లోని ప్రముఖ నాయకులతో పరిచయం పెంచుకున్నారు. ఆ అగ్ర శ్రేణి నాయకుల్లో ఒకరయ్యారు. 1920 ప్రాంతాల్లో మహాత్మాగాంధీ నాయకుల్నీ, ప్రజల్నీ చైతన్యవంతుల్ని కావించడం కోసం ఆంధ్రదేశ పర్యటనం చేశారు. రాయలసీమలోని గాంధీగారి పర్యటనం విజయవంతం కావడానికి కారకుడు కడప కోటిరెడ్డి గారే! ఆయన చూపిన కార్యదీక్ష శక్తి సామర్థ్యాలే గాంధీజీ పర్యటననూ, విజయవంతం చేశాయ్. ప్రజల హృదయాల్లో స్వాతంత్ర స్ఫూర్తిని నింపాయ్. 1940 సం॥ సత్యాగ్రహోద్యమంలో కోటిరెడ్డిని ప్రభుత్వం కారాగారం పాలుచేసింది. 1942 సం॥ము క్విట్ ఇండియా ఉద్యమంలో కోటిరెడ్డిని అరెస్టు చేసి వెల్లూరు, అమరావతి జైల్లో ఉంచింది. ఆ సమయంలోనే ఆయన తండ్రిగారు మరణించడంతో కోటిరెడ్డిని విడుదల చేశారు.



కడప కోటిరెడ్డి

1938వ సం॥ములో కోటిరెడ్డి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకు ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. అప్పుడు కాంగ్రెసు అధ్యక్షుడు పట్టాభి సీతారామయ్య. కోటిరెడ్డి గారి అర్ధాంగి రామసుబ్బమ్మ కడప జిల్లా బోర్డుకు అధ్యక్షులుగా నియుక్తులయ్యారు. ఆంధ్రోద్యమానికీ ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికీ కోటిరెడ్డి చేసిన సేవలు ఇన్నీ అన్నీ కావు. 1920 సం॥ములో బెజవాడలో జరిగిన ఆంధ్ర మహాసభకూ, 1932లో మద్రాసులో జరిగిన ఆంధ్ర మహాసభకూ కోటిరెడ్డిగారే అధ్యక్షులు. ఇలా మూడు ఆంధ్ర మహాసభలూ కోటిరెడ్డి అధ్యక్షతనే జరిగాయ్. కోటిగళాల నినాదంతో మద్రాసు రాష్ట్రరాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలని నినదించిన గొప్ప వ్యక్తి కోటిరెడ్డి రాయల సీమ ఆంధ్ర రాష్ట్రంలో కలిసి ఉండాలన్న శ్రీ బాగ్ ఒడంబడిక కూడా అప్పుడే జరిగింది. రాయలసీమ తరపున పాల్గొన్న సంధానకర్త సంతకకర్త కోటిరెడ్డిగారే.

కోటిరెడ్డి తన 32వ ఏట మద్రాసు ఉమ్మడి రాష్ట్ర సభా సభ్యులయ్యారు. అప్పటి ముఖ్యమంత్రి పానగల్ రాజాగారు కోటిరెడ్డి గార్ని తమ జస్టిస్ పార్టీలో చేరితే మంత్రి పదవినిస్తామని ఎర వేశారు. అయినా ఆయన కాంగ్రెస్‌ను విడనాడలేదు. నలభై సంవత్సరాలు ఎం.ఎల్.ఏ. జీవితం కాంగ్రెసుతోనే జరిగింది. నిండు నూరేళ్లు జీవించవలసిన ఆ సత్యవంతుడు, నీతివంతుడు కడప కోటిరెడ్డి గారు 1981 సం॥ము జనవరి 28న తన 95వ ఏట నిండు జీవితం అనుభవించి దివికేగారు. నవ్యాంధ్ర నిర్మాతల్లో కోటిరెడ్డిగారెన్నదగిన వ్యక్తి. ●

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



# ఆధ్యాత్మ విలువల సుగుణ శ్రేష్ఠి
# ప్రతిభా నరసింహులు చెట్టి

**బెం**గుళూరులోని రిచ్‌మండ్ సర్కిల్‌లోకి వెళ్ళగానే కుబేర స్థానంలో ఓ నాలుగు అంతస్థుల శిఖర భాగంలో 'ప్రతిభా' అనే ఇంగ్లీషు అక్షఱాలు **PRATHIBHA** కనిపిస్తాయ్. వాటిని చూడగానే అక్కడో ప్రతిభా సంపన్నుడున్నారని భవనం సంకేతమిస్తుంది. వెండి మబ్బుల్లో నక్షత్రాలుగా ప్రతిభా అక్షరాలు మెరుస్తూ కనిపించే చుక్కల తెల్లదుప్పటిలా ఉన్న ఆ భవనంలోకి నాన్నగారితో ప్రవేశించాను. అదే **ప్రతిభా జ్యువెలర్స్.** లోపలికి వెళ్ళిన వెంటనే ధవళ వస్త్రధారి, స్థితప్రజ్ఞుడైన **సకల నరసింహులు చెట్టి** గారిని నాన్నగారితో బాటు నేను వెళ్ళి కలుసుకునే అవకాశం దొరికింది.

**సకల నరసింహులు చెట్టి** గారిని కలుసుకోలేనేమో, కలుసుకునినా మాట్లాడే అవకాశము వారి వ్యాపార ఒత్తిడి యందు కలుగదేమో అనుకుంటూ అర గంటలో తిరిగి వెడదామని తలచిన నేను రెండు గంటల సమయాన్ని తీసుకోవడం, నా హృదయం సంతోషంతో నిండిపోయింది. నాన్నగారి పట్ల ఆయనకున్న గౌరవం నన్ను అచ్చెరువొందించింది. అవును నాన్నగారు రా వెడదాం అని అన్నప్పుడు వారి వ్యాపార సమయంలో వెళ్ళి ఇబ్బందిపెట్టడం సబబు కాదేమోనని తోచింది. కాని ఆ పెద్దాయన మాతో ఆప్యాయంగా మాట్లాడటంలో నా జడ్జ్‌మెంట్ తప్పనిపించింది.

బెంగుళూరులోని తెలుగు ఆర్యవైశ్యుల్లో బంగారం వంటి స్వచ్ఛమైన మనస్సు కలవాడు నర్శింహులు శ్రేష్ఠి. ఆయన మనసూ బంగారమే. ఆయన చేసే వ్యాపారమూ బంగారమే! 'ప్రతిభ'యని ఏ ముహూర్తాన పేరు పెట్టారోగాని, ఆయన వ్యాపారంలోగానీ, ఆధ్యాత్మిక చింతనలోగానీ, దాన ధర్మాలు వంటి సుగుణాలలోగానీ **ప్రతిభ** కనిపిస్తూనే ఉంటుంది.



సత్యం మాట్లాడే వానివద్ద, ధర్మంగా నడిచేవాని వద్ద, నొప్పించక తానొవ్వని వాని వద్దా, ఇతరుల బాధల నెఱింగి, ద్రవించి, ద్రవ్య సహాయం చేస్తూ, ఆ చేతి సహాయాన్ని రెండవ చేతికి తెలియచేయని వానివద్దనూ, వాక్శుద్ధి ఉంటుందని అంటారు. అలా ఆయన ఎంతమందికో ఉపకారం చేయడం, సత్య మనస్సుతో ఆశీర్వదించడం ఎన్నో విషయాల్లో గ్రహించాను. ఆయన నిరంతరం చేసే ధర్మ కార్యాలనే గాకుండా, పెనుగొండ క్షేత్రములో నిర్మిస్తున్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరాలయ ట్రస్టీ భూరి దానమొనర్చిన దానశీలి.

ఆయనకు గీతాబోధకుడు స్వామి చిన్మయానంద అంటే ఎంతో భక్తి, గౌరవం. బెంగుళూరులోని చిన్మయా మిషన్‌కు అధ్యక్షులు. నరసింహులు చెట్టి చిత్తాన్ని చిన్మయానంద ఎంతో మెచ్చుకునేవారు.

సకల నరసింహులు శెట్టి గారు యశోసంపన్నులు, గుణసంపన్నులూ, సంస్కృతీ సంపన్నులు! నాకు తెలిసి నంతవరకూ వాణిజ్యమే గాకుండా, విజ్ఞానంపై, ఆర్యధర్మంపై ఆసక్తికలవారు!

ఆయన మదనపల్లిలోని థియోసాఫికల్ కళాశాలలో చదువుకున్నారు. అంటే అక్కడే ఆయనకు పడవవలసిన విజ్ఞాన బీజం పడింది. ఆ సమీపపు హిందూపురము నకు చెందినవారు సకల సంజీవయ్య శ్రేష్ఠి, కనకమ్మ దంపతుల పుత్రరత్నంగా 1926వ సం॥ములో జన్మించారు. తాత్విక గురువు జిడ్డు కృష్ణమూర్తి నడయాడిన సుక్షేత్రభూమి మదనపల్లి. రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయులు పాదం మోపారు. ఇప్పటికీ అక్కడ విద్యాలయాలకు, ఉద్యాన వనాలకు నిలయంగా, చక్కటి పర్వతాల విలయంగా ఉన్నది.

రామలక్ష్మణుల్లా ఆయన ప్రక్కన ఉండే శరత్ మురళి ఇరువురి కుమారుల ఔత్సాహ, ఔదార్య, సకల గుణశీలత తండ్రి నుండి వారికి సంక్రమించినందుకు సంతోషంగా ఉంది.

70 యేండ్ల క్రితం సకల నరసింహులు శ్రేష్ఠి బెంగుళూరు తరలివచ్చారు. పిల్లనిచ్చిన తండ్రి మామగారు దేవత శ్రీరామయ్యశ్రేష్ఠిగారి వద్ద బంగారు నగలషాపులో వ్యాపార మెలకువలన్నీ గ్రహించారు. ఆయనతోనే 1952 సం॥ము బంగారు నగల వ్యాపారం ప్రారంభించారు. ఆ నగల వ్యాపారం రోజు రోజుకు ప్రతిభతో శుక్లపక్షంలోని రేరాజుగా అభివృద్ధి చెందుతూదంటే నరసింహులు శ్రేష్ఠి గారి ప్రతిభే! అందుకే ననుకుంటా జ్యువెలరీ సంస్థకు 'ప్రతిభా' అను మూడు అక్షఱముల నామఫలకం. మరో విశిష్టత ఏమంటే– ఆ చుట్టుప్రకల బంగారు బజారుగాని, కొట్టుగానీ వాణిజ్యబజారుగానీ కనిపించదు. 'ప్రతిభా' అక్షఱాలే ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయ్– అంటే నక్షత్రాల నడుమ చంద్రుడు భాసిల్లినట్లు, బెంగుళూరు నగరం మధ్య నక్షత్రమండలంగా ప్రతిభ వుందంటే అతిశయోక్తి కాదు.

నాన్నగారితో ఆయనను, వారి కుమారులను రెండుసార్లు కలుసుకునే అవకాశం కలిగింది. నరసింహులు చెట్టిగారితో కనీసం గంటసేపయినా మాట్లాడి వుంటాం. అంతటి వ్యాపార బిజీ సమయంలోను ఆయన నాన్నగారిని గౌరవించి మాట్లాడటం, ఆయనను రిసీవ్ చేసుకుని మళ్ళీ తిరిగి కారువరకూ వచ్చి సాగనంపటంలో ఆయనయొక్క సౌశీల్యత, సౌహార్ధత, వినమ్రత చూసిన నాకు ఆనందం కలిగించింది. మళ్ళీ ఒకసారి వెళ్ళి ఆ మహానుభావుని దర్శించాలనే కోరిక ఎక్కువయ్యింది. ●

# జనవరి 26 సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించిన రోజు

**'నమో హిందు మాతా, సుజాతా నమో జగన్మాతా!**
**అమోఘ దివ్య జ్ఞాన సమేతా, అఖండవర భరతఖండ మాతా**
**గోలుకొండ నీ రత్నకోశమట, కోహినూరు నీ జడలో పువ్వట**
**తాజమహలు నీ దివ్య భవనమట, ఆహాహా నీ భాగ్యము మాతా**
**విపుల హిమాద్రులె వేణీ భరముగ,**
**గంగా యమునలె కంఠహారముగ**
**ఘన గోదావరి కటి సూత్రమ్ముగ,**
**కనులకు చెలువము ఘటించు మాతా'**

అంటూ బారతమాతను స్మరించుకొనే స్వేచ్ఛాపూరిత పర్వదినం.

అయితే ఆ రోజునైనా బారతమాతను స్వేచ్ఛగా పూజించుకోలేని అభద్రతా దినంగా వరలుతూంది. భారత స్వాతంత్ర గణదినోత్సవ షష్టాబ్ది లేదు.

ఎక్కడ ఏ ఆగంతకుడు బాంబు పెడతాడో, తుపాకీలతో వస్తాడోయని గుండె గుబుల్ గుబుల్‌గా ఉంటుంది. వేద పురాణాలు వర్ధిల్లి, దివ్య సంస్కృతీ శాస్త్రాలను ప్రపంచ దేశాలకు అందించిన భారతమాత పడ్తున్న ప్రసవవేదనమిది.

స్వాతంత్ర్యం సిద్ధింప చేయడానికి అవిరణ కృషిచేసి, ఆత్మార్పణలు చేసినవారంతా ఈ దశాన్నుంచీ పోయారు. అంటే త్యాగులు పోయి భోగులు మిగిలారు. గాంధీగారి ప్రాణార్పణ కావించి నప్పట్నుంచీ, ఆ గాంధీ వంశస్థులు లేకపోగా, దేశం మాత్రం గాంధీ వంశజులు కాని గాంధీలతోనే పాలనం జరుగుతూంది.

ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సంజయ్‌గాంధీ, మేనకాగాంధీ, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వీరందరూ గాంధీలుగా వ్యవహరింపబడుతున్నప్పటికీ మోహన్‌దాస్ కరమ్‌చంద్ (మహాత్మా) గాంధీ కుటుంబానికి ఏవిధంగా చెందారో, ఇప్పుడుంటున్న కాంగ్రెసు పార్టీ ఆనాటి దేశభక్తుల కాంగ్రెసు పార్టీకి వారసత్వ పార్టీ కానేకాదు.



ఆనాటి ఆ మహాత్మాగాంధీ హింతువులకు తలమానికమైన 'భగవద్గీత'ను నిత్యపారాయణం చేసేవాడు. రామాయణం పఠించే వాడు.

**రఘుపతి రాఘవ రాజారామ్**
**పతీతపావన సీతారామ్**

అనే పదాలు నిత్యమూ ఆయన పెదవులపై చిందులేసేవి. కానీ ఇప్పటి కాంగ్రెసు నేతలకది రుచింపదు. రామజన్మ స్థానమైన అయోధ్యలో రామాలయ నిర్మాణానికి వ్యతిరిక్తులైన వీరు గాంధీయులనిపించుకుంటారా–

నిస్పృహ పనికిరాదు కాబట్టి – పరిస్థితులెంత దిగజారినప్పటికినీ ముందుండేవి మంచి రోజులని శ్రీశ్రీ పాటను పునశ్చరణం చేసుకుందాం! ●

## ఏడో తరగతికే ఎన్నో పుస్తకాలు చదివిన

# భవజ్ఞ

పిల్లలలో చదివే అలవాటు పెంపొందించాలి. కథలతో మొదలయి అన్నిరకాల పుస్తకాలు చదువుతారని చెబుతుంటాం. చదివే పిల్లల గురించి ఉదాహరణలు చెప్పవలసి వచ్చినప్పుడు ఎక్కడెక్కడివో, చాలావరకు విదేశాలలోని పిల్లల గురించి చెప్పవలసి వచ్చేది. నిజానికి మన దేశంలోనే మన తెలుగు రాష్ట్రాలలో ఎంతోమంది వున్నారు. కాకపోతే అవి మన దృష్టికి రావడం లేదు.

పిల్లల పుట్టినరోజు కానుకగా పుస్తకాలు అందించే తల్లిదండ్రులూ మనకు అక్కడక్కడా తారసపడతారు.

'తెలుగు పుస్తకమా? మా అబ్బాయి తెలుగు చదవలేడండీ.' తెలుగు పుస్తకాలు చదవలేరేమోనని ఆంగ్ల పుస్తకం తీసుకెళ్లామనుకోండి. 'మా అమ్మాయికి తరగతి పుస్తకాలు చదవడానికే సమయం సరిపోవడం లేదు. ఇలాంటి కథల పుస్తకాలేం చదువుతుంది?' ఇలాంటి మాటలు ఎదుటివారినుండి వినబడితే పుస్తకాలు బహుమతుల క్రింద యిచ్చే మిత్రులు తల్లడిల్లకుండా ఎలా వుంటారు?

లాక్‌డౌన్ సందర్భంగా నెల్లూరులో ఓ ఆణిముత్యంతో నాకు పరిచయ మేర్పడింది. ఆమె పాటూరి భవజ్ఞ. ఏడో తరగతి చదువుతోంది. కరోనా కారణంగా పాఠశాలకెళ్లే పనిలేదు. పుస్తకాలు చదివే పనిలో పడిందీ పాప. పుస్తకాలు తెచ్చిపెట్టమని తండ్రిని పురమాయించింది. ఆమె తండ్రి సుబ్రహ్మణ్యం. ఓ ఇరవై పుస్తకాలు కొనుక్కెళ్లాడు. వారం తిరగకముందే సుబ్రహ్మణ్యం నుండి నాకు ఫోన్ వచ్చింది. 'ఇంకా పుస్తకాలు కావాలి. ఎప్పుడు రమ్మంటారు?' అని అడిగాడు. పుస్తకాలు చదవడం పట్ల భవజ్ఞ ఆసక్తిని గమనించాక మీరు పుస్తకాలు కొనాల్సిన పనిలేదని చెప్పి ఉచితంగా పుస్తకాలు ఇచ్చాం. పాప చదివాక వాపసు చేయండి' అని చెప్పాను. పట్టుమని పదిరోజులు కూడా కాలేదు. ఒకరోజు భవజ్ఞ తండ్రితో స్వయంగా గోడవున్‌కు వచ్చింది. చదివిన పుస్తకాలు వాపసు చేసింది. గోడవునంతా కలియ దిరిగి 50 పుస్తకాలు ఎంపిక చేసింది. పుస్తకాలు ఎంపిక చేసుకొనే సందర్భంలో భవజ్ఞ చూపిన శ్రద్ధాసక్తులు ఆమెకు పుస్తకాలపై గల ప్రేమను కళ్లకు కట్టాయి.




50 పుస్తకాలు చదవడం పూర్తయ్యాక తల్లినీ, తండ్రిని యిద్దరితో కలిసి వచ్చింది. ఏకంగా 100 పుస్తకాలు ఎంపిక చేసుకొంది. ఆ పుస్తకాలలోని పాత్రల గురించి, సంఘటనల గురించి నాతో ముచ్చటించింది. 'మరో విడత పుస్తకాలు తీసుకెళ్ళేందుకు ఎప్పుడు రమ్మంటారంకుల్' అంటూ ఫోన్ చేసింది. ఏప్రిల్ 2020 నుండి అక్టోబరు 2020 వరకు ఏడు మాసాల వ్యవధిలో ఏడో తరగతి చదివే భవజ్ఞ ఎన్ని పుస్తకాలు చదివిందా అని లెక్కలేసి గుడ్లు తేలేయడం నా వంతైంది.

భవజ్ఞకు పుస్తకాలు చదివే అలవాటు తండ్రి నుండి సంక్రమించింది. నెల్లూరులోని రెయిన్‌బో సిబిఎస్‌ఇ స్కూల్లో ఏడవ తరగతి చదువుతుంది.

పుస్తకాలు చదవని పిల్లలూ వున్నారు. పుస్తకాలు బాగా చదివే భవజ్ఞలాంటి పిల్లలూ వున్నారు. అందరూ మన పిల్లలే. చదవడానికి, చదవకపోవడానికి రెండింటికి కారణాలుంటాయి. ఆ కారణాల లోతులను పరిశీలించి పుస్తకాల చదివే దిశగా మన బిడ్డలను నడిపించుకోవడం మనందరి బాధ్యత.

– **మాల్యాద్రి,** గ్రంథాలయ సర్వస్వం

# గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్



తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన విద్వాంసులు, మధుర గాయకులు, అద్భుత స్వరకర్త గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారు సంగీతానికి అంకితమైన ఒక పుంభావ సరస్వతి. 1948 నవంబరు 9 న రాజమహేంద్రవరంలో జన్మించారాయన. ప్రఖ్యాత నేపథ్య గాయని శ్రీమతి ఎస్. జానకి ఆయనకు స్వయానా పిన్నిగారు.

శ్రీయుతులు నేదునూరి, పశుపతి, మంగళంపల్లి గార్లు వీరికి గురువులైనా, గరిమెళ్ళవారి బాణి, ఈ ముగ్గురు త్రిమూర్తుల మేలు కలయిక అని చెప్పవచ్చు. నేదునూరివారిలోని రాగభావం, పశుపతిగారి గాత్రంలోని శ్రుతిశుద్ధం, బాలమురళి వాణిలోని లాలిత్యం కలబోసిన బాణి వీరిది.

అన్నమయ్య చేసిన పదార్చనకు గరిమెళ్ళవారి రాగాలు 'బంగారానికి తావి' అనిపిస్తాయి. 150 కి పైగా రాగాలను తీసుకొని, 800 కు పైగా సంకీర్తనలకు వైవిధ్యభరితంగా బాణీలు కట్టిన ఘనత వారిది. ఆయన స్వరపరచిన అన్నమయ్య సంకీర్తన వింటుంటే, సాహిత్యం, దానికి తగ్గ సంగీతం జతగా కలసి, మెలసి, 'అన్నమయ్య మనతో మాటాడుతున్నారా!' అనిపిస్తుంది.

మోహన, హిందోళ, శుద్ధధన్యాసి వంటి రాగాలలో సాధారణంగా ఎవరు స్వరపరచినా పరిమితమైన అవే సంగతులు కనబడతాయి. కానీ గరిమెళ్ళవారు ఒకదానికొకటి భిన్నమైన స్వరప్రయోగాలతో, సాహిత్యంలో ఒదిగిపోయే విధంగా స్వరం సమకూర్చటం విశేషం. ఔడవ (5 స్వరాల) రాగాలలోనే ఆయన అధిక భాగం స్వరపరిచారు.

ఇక, ఆయన సృష్టించిన రాగాల విషయానికొస్తే సుందరరంజని, వాణీప్రియ, చిత్ర కల్యాణి వంటి రెండుపదుల రాగాలను, వినూత్న భావావిష్కరణలకు ఆలవాల మయేట్లు ఆయన సృజించారు. ఇది ఆయన మరో నవ్య శోధన.

ఆయనకు మృదంగ వాదనంలోను ప్రవేశం ఉంది...

తిరుమల తిరుపతి దేవస్థానముల రికార్డింగ్ ప్రాజెక్టు ఎక్స్పర్ట్ కమిటీ సభ్యుడినైన నా అనుభవంలో తెలుసుకున్నది ఏమంటే గరిమెళ్లవారు రూపొందించిన సిడిలకు కళ్లు మూసుకొని ఆమోదం తెలపటం తప్ప మరో ఆలోచన అనవసరం. అంత ప్రామాణికంగా ఉంటాయి అవి.

5000 కు పైగా విశ్వమంతా పర్యటించి, ఆయన నిర్వహించగా శ్రోతలు బ్రహ్మరథంపట్టిన ప్రదర్శనలు, 'అన్నమయ్య సంకీర్తన మహతి', 'అన్నమయ్య నాద జ్యోతి' వంటి లెక్కకు మిక్కిలియైన బిరుదాలు, సమర్పించిన అసంఖ్యాక ఆడియో సీడీలు... ఇవన్నీ ఒక ఎత్తు అయితే, ఆయన రచించి, స్వరపరచి, గానంచేసిన లలితగీతాలు మరొక ఎత్తు. అవి నిజంగా ఆణిముత్యాలే. . మధురభావ తరంగాలే...

గరిమెళ్ళవారు స్వరసహితంగా వెలువరించిన స్వీయ రచిత ఆంజనేయ కృతిమణిమాల, వినాయక కృతులు, నవగ్రహ కృతులు, సర్వదేవతా స్తుతి రచనలు... అనేకం బహుళ జనాదరణ పొందాయి. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ గారి 'శివపదం' భక్తి గీతాలు, గరిమెళ్లవారి స్వరమెట్లతో శాశ్వతత్వాన్ని పొందాయి.

గరిమెళ్ళవారి గళం వినబడని ఆకాశవాణికేంద్రం లేదు... భక్తిరంజని కార్యక్రమం లేదు. దేశమంతటా పర్యటించి, 'అన్నమయ్య నాదయజ్ఞాలు' ఎన్నో విజయవంతంగా నిర్వహించారు.

తిరుమలకొండపై ఒక భక్తుడు స్వామి దర్శనార్థమై వచ్చి నిలుచున్నప్పుడు, ఏమూల ఉన్నా, ఏ చోటనున్నా, గాలిఅలలపై తేలివచ్చే గరిమెళ్ళవారి గళం చెవికి సోకగానే, మధురానంద భరితుడవటం తథ్యం. తిరుమల తిరుపతి దేవస్థానానికి అంకితమైనారు గరిమెళ్లవారు...

వారి గాన కచేరీలెన్నో ప్రత్యక్షంగా విన్న భాగ్యవంతుణ్ణి. తాను ఏది పాడినా, ఆ పాటలోని ప్రతి మాటను, రాగంలోని ప్రతి సంగతినీ స్ఫటికమంత స్వచ్ఛంగా పలికించగల గంధర్వ గానం వారిది.

ఎంత ఎదిగినా ఒదిగి ఉండే నిరాడంబర స్వభావి వారు. ఆయనకు నాతో పని ఉంటే, స్వయంగా రెండు మూడు సందర్భాలలో మా ఇంటికి స్వయంగా వచ్చి నన్ను కలసి, ఆశ్చర్యపరిచారు. తాను రచించిన ప్రతి గ్రంథాన్నీ ముందుగా నాకు అందచేసి, నా అభిప్రాయం తెలుసుకొనేవారు.


ఒకసారి బెజవాడలో అన్నమయ్య ఆరాధనలో నేను ఆయన సమక్షంలో అన్నీ ఆయన స్వరపరచిన సంకీర్తనలు పాడితే, ఆయన పొందిన ఆనందం వర్ణనాతీతం. ఆ ఆనందాన్ని అభినందన మందారమాలగా నాకు సమర్పించా రాయన! తిరుపతి లో ఆయన హాజరుకాని నా కచేరీలు బహు కొద్ది మాత్రమే.. నేనంటే అంత అభిమానం ఆయనకు!

ఆయన పలుకు ఎంత మంద్రమో గానమంత మార్దవము. అనవసర విన్యాసా లకు, ఆడంబర విద్వత్ప్రదర్శనలకు ఆయన దూరంగా ఉంటారు.

అయితే, సాంప్రదాయాన్ని గౌరవిస్తూ ఆయన చేయని సంగీత, సాహిత్య ప్రక్రియ లేదు. శ్రోతలను తనతోపాటు తోడ్కొనివెళ్ళి, ఏడుకొండలూ ఎక్కించి, తుట్టతుదకు స్వామిదివ్యదర్శనం చేయిస్తుంది గరిమెళ్ళవారి గానం. అది అనన్య సామాన్యం.

'అన్నమయ్య కీర్తనలకు బాలకృష్ణప్రసాద్ గారి బాణీలకు సాటి మరిలేవు' అనటం అతిశయోక్తి కాదు. అందుకే గరిమెళ్ళవారు 'అన్నమయ్య వరప్రసాది'.

– మొదుముది సుధాకర్



# నాన్న

బ్రహ్మదేవుడు చాలా బిజీగా తల రాతలు రాసే పనిలో ఉన్నాడు. ఇంతలో నేను, భూమి మీదకు వెళ్ళను అని మారాం చేయడం మొదలుపెట్టాను.

"భూమి మీద నాకు ఎవ్వరూ తెలీదు. నేను ఎలా బతకగలను? అని అడిగాను. నువ్వేం భయపడకు. నిన్ను కాచి కాపాడటానికి నా అంశగా ఒక అమ్మను తయారుచేశాను. ఆమె కడుపులో నిన్ను పుట్టిస్తా" అన్నాడు బ్రహ్మదేవుడు.

"అయితే సరే, కానీ నాకు ఎప్పుడు ఏ ఇబ్బంది వచ్చినా నేను ఏడవటం మొదలుపెడతా. అప్పుడు మీరు నా ఇబ్బందిని తొలగించాలి" అనే షరతు పెట్టాను.

దానికి బ్రహ్మ, "సరే నీకు మాటలు రానంత వరకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులం ముగ్గురు నీకు సహాయం చేస్తాం" అన్నాడు.

"మరి, ఆ తర్వాత చెయ్యరా?" అని అడిగా

"అదేం లేదులే. నీకు మాటలొచ్చాకా నీకో మహా మంత్రం భోదిస్తాం. నీకు ఏ కష్టం వచ్చినా, ఒక్కసారి ఆ మంత్రం పఠిస్తే తప్పకుండా నీకు సహాయం దొరుకుతుంది." అని చెప్పాడు బ్రహ్మ.

మళ్ళీ ఇంకేదో అడగబోయే లోపల ఆ పరబ్రహ్మ, తన బెడ్రూం బాల్కనీ లోంచి నన్ను కిందకి త్రోసేశాడు. ఎలా వచ్చి చేరానో తెలియదు గానీ, ఆసుపత్రి బెడ్ మీద మా అమ్మ పక్కన వచ్చిపడ్డాను.

అమ్మ పక్కన హాయిగా నిద్రపోతున్న నన్ను, ఓ పెద్దమనిషి తన చేతిలోకి తీసుకున్నాడు. భయమేసి, అమ్మ వైపు చూసి ఏడుపు ముఖం పెట్టాను. "మీ నాన్నగారు రా!" అంటూ అమ్మ తన కంటి చూపు తో ఆయన్ని పరిచయం చేసింది.

బ్రహ్మదేవుడు నాకు అమ్మ గురించి చెప్పి పంపాడు. తను అన్ని చోట్ల ఉండటం కుదరక అమ్మని సృష్టించాను అని. మరి నాన్న అంటే ఎవరు? భూమి మీద పడిన మొదటి రోజే నా బుర్రలో ఎన్నో ఆలోచనలు మొదలయ్యాయి.ఆ దేవుడినే అడిగి తెలుసుకుందామని ఏడుపు మొదలుపెట్టా.

"ఇప్పుడే కదా భూమి మీద పడ్డావు. అప్పుడే నన్ను గుర్తుచేసుకున్నావేమిటి?" అని అడిగాడు. అమ్మ గురించి చెప్పారు గాని, నాన్న గురించి ఏమీ చెప్పలేదెంటని అడిగా.

"నీ జన్మకి నాంది, నీ భవితకు పునాది" అని ముక్తసరిగా బదులిచ్చి, "అర్థమైందా?" అని ప్రశ్నించాడు.

"పాలు తాగే పసివాడి ప్రశ్నకి ప్రాస తో బదులిస్తే ఎలా అర్థం అవుతుంది స్వామి" అని సమాధానం చెప్పాను.

ఒక అర్థం లేని చిరునవ్వు నవ్వి, "నీకూ మీ అమ్మకు కాపుగా నేను నియమించిన అంగరక్షకుడు" అని క్లుప్తంగా చెప్పాడు. అప్పుడు అర్థమైంది నా బుజ్జి బుర్రకి, నా కష్టం తీర్చేది అమ్మ అని. మాకు ఏ కష్టం రాకుండా చూసుకునే బాధ్యత నాన్నదని.

ఆ రోజు నుంచి నా చిన్ని కళ్ళు నాన్న కోసం వెతుకుతూనే ఉండేవి. ఎప్పుడో ఉదయన్నే వెళ్ళిపోయి సాయంత్రం వచ్చేవాడు. "ఏం, నేనంటే ప్రేమ లేదా" అని ప్రశ్నించా ఆ దేవుడిని మళ్ళీ. "నీ మీద ప్రేమ ఉంది కాబట్టే, రోజు బయటికి వెళ్ళి కష్టపడి పని చేసి వస్తున్నాడు" అని బదులిచ్చాడు బ్రహ్మ. అర్థం కాలేదని చెప్పాను. కొన్నేళ్లకు నీకే అర్థం అవుతుందిలే అన్నాడు.

ఈయన అన్నీ తల తిక్క సమాధానాలే చెబుతాడులే అనుకుని, నా దగ్గరికి వచ్చిన మా నాన్న మొహం చూసా. మా నాన్న ముఖం నీరసంగా కనిపించింది. పలకరింపు కోసం ఒక చిరునవ్వు నవ్వా. మా నాన్న ముఖం లోని నీరసం మాయమైంది. నన్ను చూసిన ఆయన ముఖం పున్నమి చంద్రుడిలా మెరిసిపోసాగింది. ఆ దేవ దేవుడు నా నవ్వులో ఇంత మహిమ దాచాడా! అని గర్వపడటం మొదలుపెట్టా.

మళ్ళీ మళ్ళీ నవ్వడం నేర్చుకున్నా. నేను నవ్విన ప్రతి సారి, మా నాన్న ముఖంలో ఆనందం పది రెట్లు ఎక్కువగా కనిపించేది. మా నాన్న నన్ను ముద్దులతో ముంచేయటం మొదలుపెట్టారు. అలా ఆ సాయంత్రాలు మా ఇద్దరి మధ్య సాన్నిహిత్యాన్ని పెంచాయి.

కొన్నాళ్ళకి, నా చిట్టి పాదాలకి కొంచెం బలం చేకూరింది. నడక నేర్చుకుందా మని ప్రయత్నించా. కానీ ఫలితం లేదు. పదే పదే పడిపోతూనే ఉన్నా. ఇంతలో నాన్న తన చూపుడు వేలును నాకు అందించాడు. నేను నడవలేకపోతున్నానని వెక్కిరిస్తున్నాడనుకున్నా! "నా వేలు పట్టుకుని నిల్చో నాన్నా" అన్నారు.

నిలబడగలిగాను కానీ, నా అడుగులు ఇంకా తడబడుతూనే ఉన్నాయి. ఆ మహా శివుణ్ణి, మనసులో ప్రార్దించడం మొదలుపెట్టా. తన ఢమరుక నాదంతో నా పాదాలని ప్రేరేపించమని ప్రాధేయపడ్డాను. ఆ ఢమరుక నాదపు సడిలో, వడి వడిగా అడుగులు వేయటం నేర్చుకుని మా నాన్నను ఆశ్చర్యపరుద్దామనుకున్నా. ఆ మహా శివుడికి నా మొర వినిపించలేదేమో! నా ప్రార్థనకి జవాబు దొరకలేదు. ఇంతలో మా నాన్న వెల్లకిలా పడుకున్నారు. నన్ను తన రెండు చేతులతో పట్టుకుని తన గుండెల మీద నిలబెట్టుకున్నారు. డమరుక నాదం లేకపోతేనేం!, నా గుండే చప్పుడుని నీ అరికాళ్ళతో అనుభవించి అడుగులు వేయటం నేర్చుకోమని అభయమిచ్చారు. ఏం మాయో తెలీదు. నాన్న గుండె చప్పుడు నా కాళ్ళకి తగలగానే నేనే శివుడిలా మారిపోయా. నడక రాని నేను నాన్న గుండెల మీద యధేచ్ఛగా నాట్యం చేయటం మొదలుపెట్టా.

నడక నేర్చిన నా చిన్ని పాదాలు కొత్త గమ్యాలను వెతకటం ప్రారంభించాయి. నడవటం మొదలుపెట్టాను. కొంత దూరం వెళ్ళాక, అటూ ఇటూ చూశాను. ఎవ్వరూ కనిపించలేదు. భయం వేసింది. ఆ శ్రీ మహా విష్ణువు అన్ని చోట్ల ఉంటాడుగా, మరి నాకు భయమెందుకు. ఆయన్నే పిలుద్దాం అని మనసులో తలుచుకున్నా. ఆయన కనిపించలేదు గాని వినిపించాడు. "ఏమైంది బాలకా" అని అన్నాడు. "భయం వేసింది స్వామి. అందుకే పిలిచా" అన్నా నేను.

"భయం ఎందుకు? నీవు నడుస్తుంది మీ నాన్న నీడ లోనేగా" అన్నాడు. ఆశ్చర్యం వేసి వెనక్కి తిరిగి చూసా. అవును నాన్న నా వెనకే ఉన్నారు. నాకు తగినంత స్వేచ్ఛనిస్తూ, నా ప్రయాణాన్ని గమనిస్తూ, నన్ను ఏ ప్రమాదం తాకకుండా, నాకు రక్షణగా నా వెనకే నడుస్తున్నారు. నా మనసులో భయం తొలగి ముఖంలో చిరునవ్వు మొదలయ్యింది. అప్రయత్నంగానే నా పెదవులు 'నాన్న' అని పలకటం మొదలుపెట్టాయి. నాన్న నన్ను ఎత్తుకుని నా ముఖమంతా ముద్దులతో ముంచేశారు. మళ్ళీ మళ్ళీ నాన్న అని పిలవమన్నారు. నేను పిలిచిన కొద్దీ, నాన్న ముఖంలో ఆనందం రెట్టింపు అవుతూనే ఉంది.

నాకు ఏ అవసరం వచ్చినా, ఏడ్చి ఆ దేవుడిని పిలిచే బదులు, మా నాన్నని పిలవడమే మేలు అనిపించింది. దేవుడు వచ్చేవాడో, రాడో తెలీదు గాని మా నాన్న మాత్రం నన్ను కంటికి రెప్పలా కాపాడుతూనే ఉన్నాడు. నా అవసరాలన్నీ, నేను చెప్పక ముందే తెలుసుకుని మరీ తీర్చేవాడు. కొన్నాళ్ళకు నాన్న కూడా ఆ దేవుడి దగ్గరికి వెళ్ళిపోయారు. కానీ ఆయన నేర్పిన జీవిత పాఠాలు నాకు తోడుగా ఉండేవి.

ఆఖరికి నేను కూడా ఆ దేవుడి దగ్గరికి తిరుగు ప్రయాణం మొదలుపెట్టాను.

"నీ జీవిత మజిలీ ఎలా సాగింది?" అని ప్రశ్నించారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు.


"మీరు నాకు ఏ మంత్రమూ భోదించకపోయినప్పటికీ, నా జీవన చక్రం బాగానే సాగింది ప్రభు." అని సమాధానం చెప్పాను గర్వంగా.

"అదేంటి అలా అంటావ్! మేము నీ నోట పలికించిన మంత్రాన్ని రోజు నువ్వు పఠిస్తుండటం మేము నిత్యం గమనిస్తూనే ఉన్నాం" అన్నారు మూకుమ్మడిగా.

"నాకు ఏం అర్థం కావట్లేదు స్వామి" అని బదులిచ్చా నేను. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురు ఒకరిలో ఒకరు ఐక్యం అవుతూ ఒకే రూపంగా మారి ప్రత్యక్షమయ్యారు. ఆశ్చర్యపోయాను. మా నాన్న రూపం నా ముందు ప్రత్యక్షమైంది. అప్పుడు గానీ అర్థం కాలేదు ఈ మనిషి బుర్రకి, (మట్టి బుర్రకి). "అమ్మ ఆ దేవుడి అంశ అని" "నాన్న సాక్ష్యాత్ దేవుడని". మిమ్మల్ని గుర్తించలేకపోయాను, నన్ను క్షమించండి స్వామి. అని ఆయన పాదాలమీద సాగిలపడ్డాను.

ఆ దేవుడి ముఖంలో అదే చెరగని చిరునవ్వు. నా భుజాల మీద చేయి వేసి పైకి లేపారు. ప్రేమగా హత్తుకున్నారు. నన్ను క్షమించి, నా ఆత్మకు మోక్షం ప్రసాదించండి స్వామి అని అడిగా ఆయన చెవిలో. క్షమిస్తా, కానీ ఒక్క షరతుతో అన్నాడు ఆ దేవ దేవుడు. ఏమిటది స్వామీ! అని అడిగా ఆశ్చర్యంగా. నన్ను ఆఖరుసారిగా 'నాన్న' అని సంభోదించగలవా అని అడిగారు ఆ సర్వేశ్వరులు. ఆ మహా మంత్రాన్ని ఇంకోసారి జపించడానికి, నిముషం కూడా ఆలస్యం చేయలేదు నేను. నాన్న అని పిలిచి ఆయనలోనే ఐక్యం అయిపోయా.

"అమ్మ దేవుడి అంశ అయితే, నాన్న సాక్ష్యాత్ దేవుడే." **– వాట్సప్ సేకరణ**



# అపార విశ్వాసం అనంత శక్తి ఇవే విజయ సాధనకు మార్గాలు. - స్వామి వివేకానంద



## జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

### త్వమేవ సర్వం మమదేవ

ఇలా భగవుంతుడిని, స్వామి నీదే భారం, నువ్వే అన్నీ అంటాం. నాన్నగారికి కలియుగవరదుడు ఆ ఏడుకొండలస్వామి అంటే ఎనలేని భక్తి, సర్వస్య శరణాగతి. ఏ సందిగ్ధావస్థ ఏర్పడినా, ఏ కష్టమొచ్చినా వేంకటేశ్వరునికి మొరపెట్టుకుంటారు. నా ఏలిక నువ్వే, నువ్వే నన్ను నడిపించు అంటారు. ఈ ప్రముఖాంధ్ర 26 సంవత్సరాలు పూర్తి చేసుకుని 27 వ సంవత్సరంలోకి అడుగు పెట్టిందంటే ఆ దేవదేవుడి అనుగ్రహమే.ప్రతి ఆంగ్ల సంవత్సరం జనవరి నెల ఆ స్వామి ముఖ చిత్రంతో సంచిక వెలువడుతుంది. 26 సంవత్సరాల జనవరి ముఖచిత్రాలు ఆ దేవుడివే. ప్రముఖాంధ్రే కాదు మేము సినీరమ సినిమా పత్రిక తమిళ తెలుగు భాషలలో  నడిపినప్పుడు ఎడిటోరియల్ పేజిలో వెంకటేశ్వరస్వామి బొమ్మ కాస్త పెద్దదిగానే వేసేవారు, సినిమాలు తీసినప్పుడు ఆయన మోనోగ్రాం వుండేది. కలియుగ వరదుడు, కరుణా సముద్రుడు, కృపానిధి అయిన ఆ వెంకటేశ్వరుడంటే అంతటి భక్తి, పెద్ద కుమారుడినైన నాకు ఆ వెంకటేశ్వరుని పేరే పెట్టారు.

నా చేతిలో ఏముంది అంతా స్వామి దయ, నాకు శక్తిని ప్రసాదించి నా చేత అన్ని పనులను చేయించేవాడివి నువ్వే సుమా అనే భావనే ఆయనిది. నువ్వు సర్వజ్ఞుడివి, నాకు తెలిసిన నాలుగు మంచి విషయాలను నలుగురుకి తెలియజేసే గొప్ప అవకాశాన్ని కల్పించావు, ఇందులో నా గొప్ప తనమేమిలేది, నేను నీ చేతిలో పనిముట్టును అని ప్రార్థించడం నాకు తెలుసు.  ఇలా ఆయన మాటలో, రాసిన రాతలో, వేసిన అడుగులో, తిరిగిన ప్రతి మలుపు ఆ స్వామి దయ అని ఆనందంతో చెపుతారు. ఆయనకు స్వామిపై అంతటి నమ్మకం. కష్టం పరామర్శించినా, సుఖం తలుపు తట్టినా రెండింటిని ఒకేరకంగా చూస్తారు. ఆ నమ్మకాన్ని, విశ్వాసాన్ని బీటలువారకుండా చూస్తారు. నిజమైన భక్తుల జ్ఞానం, పాండిత్యం భగవదారాధనను నమ్ముతుంది. వారిలో అహం వుండదు. తమకున్నదంతా స్వామి చలువే అంటారు.

జనవరి నెలలో, వెంకటేశ్వరుని ముఖచిత్రం, ఓ చిన్ని వ్యాసం మీరు 26 సంవత్సరాల ప్రముఖాంధ్రలలో చూడచ్చు. అంతేకాదు ప్రతి నెలా పత్రిక తయారయ్యిన వెంటనే మొదటి పత్రికను స్వామివారి పాదాలవద్ద వుంచి తరువాతే పత్రికనంతా చూస్తారు. ఆయనతోనే, ఆ నీడలోనే పెరిగినందువల్ల ఆయనలోని సగం గుణాలు వచ్చేసాయి (జీన్స్). మిగిలిన సగం గుణాలని అందుకోవాలని ప్రయత్నిస్తున్నాను. ఆయన బాధ్యతలను తీసుకున్నాక, ప్రముఖాంధ్ర పత్రికపై ఆయనకున్న పట్టుదల, వాత్సల్యం దగ్గరుండి చూసినవాడిగా ఆయనకిచ్చిన మాటను కాపాడుకుంటూ గత 26 నెలలుగా నాకు చేతనయినంత, శాయశక్తులా, శక్తికి మించినదయినా క్రమం తప్పకుండా పత్రికను తీసుకుని వస్తున్నాను.

మొదటి అయిదారు నెలలు కాస్త కష్టమనిపించిది, పత్రికకు మ్యాటర్, ఆర్థిక వనరులు సమకూర్చుకోవడంలో కాస్త ఇబ్బంది పడ్డాను. వ్యాసాలు కొన్ని స్నేహితులను అడిగి రాయించుకున్నాను. నాన్నగారి స్నేహితులు కొందరు ప్రకటనలిచ్చి ప్రోత్సహించారు. కాని 26 సంచికలు ఒకసారి పరిశీలించి నన్ను నేను విమర్శించుకుంటే కాస్త వెలితి కనిపించింది, నాణ్యతలో ఇంకాస్త శ్రద్ధ పెట్టాలనిపించింది, ఆ తప్పును గత మూడు నెలలుగా దిద్దుకుంటూ వస్తున్నాను. ఇంతలో యావత్ ప్రపంచాన్ని అతలాకుతలంచేసిన మహమ్మారి కొరోనా వచ్చిపడింది. ఆ కొరోనా మంచి చెడు రెండూ సమంగా పంచింది. చెడు – లాక్డౌన్ సమయంలో ప్రెస్ మూతపడడం, లాక్డౌన్ తరువాత పెద్దగా వ్యాపారం లేకపోవడంతో కాస్త ఆర్థిక ఇబ్బంది ఏర్పడింది. అంతేనా ఆ కొరోనా భారినా పడ్డాను. మంచి – ఆ మూడు నెలలూ ఖాళీ సమయంలో నేను చదివిన పుస్తకాలు అందించిన విజ్ఞానం. చదివిన విషయాలను నెమరు వేసుకుంటూ ఎక్కడ ఎలా ఉపయోగించాలో తెలిసింది. అలాగే నాన్నగారు నలుగురి దగ్గిరకు వెళ్ళి పరిచయాలు పెంచుకుంటూ, సభలు సమావేశాలకు వెడుతూ ఆ విషయాలను వార్తగా కాకుండా ఒక ప్రత్యేక శైలిలో అందించేవారు. ఈ అలవాటే ఇంకా నాకు రాలేదు, కొంత కొంతగా మారతాను. మార్పనేది వెంటనే



ఏర్పడేది కాదుగా. అదో నిరంతర ప్రక్రియ. పోయిన డిశంబరు సంచికలో నూతనంగా, విన్నూతనంగా అంటూ ఏవేవో రాసేసాను, దానికి కొంతైనా న్యాయం చెయ్యాలిగా, కాస్త గమనిస్తే ఈ సంచికలో కొన్ని మార్పులను మీరు గమనించవచ్చు.

An idle man's brain is a Devil's workshop – అంటే సోమరిగా వున్నవాడి బుర్ర దెయ్యాల కొంపలా తయారవుతుందిట. ఆ కొరోనా సమయంలో నేను తెలుసుకున్న విషయాలను ఇటు పత్రికకు, నా వృత్తి, ప్రవృత్తిలకు ఉపయోగించాలనుకున్నాను. అనుకున్నవన్నీ ఆచరణలో పెట్టడానికి కాస్త సమయం పడుతుంది, ఈ జనవరి నుండి కొంత కొంతగా అమలుపరచాలనుకున్నాను, పత్రిక చదివాక నాకు మీనుండి వచ్చే స్పందనే కొండంతబలం. అలాగే నేను ఆ ఏడుకొండలవానికి సర్వస్యశరణాగతి చేస్తూ, నీ చల్లని చూపు, దయ నాపై చూపు అని వేడుకుంటూ

– సదా మీ ఆదరణ, ఆశీస్సులు కోరే  మీ, **గోటేటి వెంకటేశ్వరరావు**


రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన

"అజంతా"

వక్కపొడి

రవికుమార్ అండ్ కంపెని –

చెన్నై

అతులిత పుష్ప పల్లవ ఫలాన్విత
భూరుహ భూరివల్లరీ
- మన మాతృభాష ఔన్నత్యం అభివ్యక్తీకరించడం,
ప్రతి ఉషస్సున లేవగానే
పాఠకులపై భారం వేయరాదని,
ఆరాధించడమనే తపనం, తపస్సు!
అర్థ, వృద్ధ భారాన్ని మోస్తూనే




**313 నెలలుగా**
**313 సంచికలను**

శ్రీ వేంకటేశ చరణౌ చరణం ప్రపద్యే।

# ప్రముఖాంధ్ర

- వెలువరించ కలిగిదందంటే ఏడుకొండల టేడు కృప! వాగ్దేవి యిచ్చిన శక్తి!

'ప్రముఖాంధ్ర' వెబ్ ఎడిషన్ చూచినవారు
పాత పత్రికలను చూచినవారూ 'ప్రముఖాంధ్ర' కోరుతున్నారు.
కోరినవారందరికీ పంపాలనే ఉన్నది.
ధనసంపత్తి కలవారూ, మన సంపత్తి కలవారూ
ప్రముఖాంధ్ర నిధికి యధోచితంగా సహకరించండి.
రు.10000లు మించి పంపించిన ప్రదాతల పేర్లను
వారి ఫోటోలతో ప్రచురిస్తాం.
(ఉడతా భక్తిగా చిన్న విరాళములనూ పంపవచ్చు)



గోటేటి శ్రీరామారావు
స్థాపక సంపాదకుడు


చిరునామా:
16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 600 033.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

